# అంతరంగాలు

కప్పుకున్న శాలువాను చెవుల చుట్టూ బిగించి కిటికీలోంచి బయటకు చూశాను. పొగమంచు తెరల చాటు నుండి దోబూచులాడుతున్న లేఎండ ఉదయపు చల్లదనాన్ని కదిలించలేకపోతోంది.

నాకు ఎక్కడ లేని బద్ధకం ముంచుకు వచ్చింది. ఏమీ చేయబుద్ధి కాలేదు. మెల్లగా కుర్చీని ఎండపొడలోకి జరుపుకొని కూర్చున్నాను. శాలువాను తలపై నుంచి తీసి, గేటు వైపు చూశాను.

సైకిల్ మీద పేపర్ అబ్బాయి వేగంగా వచ్చాడు. పేపర్‌ను చుట్టి లాఘవంగా లోపలికి విసిరి, వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు.

పేపర్ నా పక్కన వచ్చి పడింది. మెల్లిగా వంగి, పేపర్‌ని చేతిలోకి తీసుకుని, యథాలాపంగా తిరగేశాను.

రైలు బస్సు ఢీ ! వంద మంది ఠా!

నిరాసక్తిగా పేపర్‌ను మడిచేయాబోయాను. ఓ రంగుల వర్ణచిత్రం నన్ను ఆకర్షించింది. ఆ చిత్రంలో చెప్పుకోదగ్గ ప్రత్యేకతేమీ లేదు. ఎవరో యువజంట వివాహ మహోత్సవమట. శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సన్నిహితులెవరో ఇచ్చిన ప్రకటన అది.

ఆ జంటలోని అమ్మాయి వంటి మీద ఖరీదైన పట్టుచీర, ధగధగలాడుతున్న నగలు, వారు బాగా సంపన్నులని చెప్పకనే చెపుతున్నాయి.

యువకుడు ఆ అమ్మాయి భుజం చుట్టూ చేయి వేసి ఠీవీగా చూస్తున్నాడు.

ఆమె అతడి వైపు ఒదిగి అతనిని ఓరగా చూస్తోంది.

గేటు బర్రున లాగిన శబ్దం వినిపించి, తలెత్తి చూసాను.

ఎదురింట్లో కొత్తగా చేరిన నవజంట. వారి గేటుకు అటూ ఇటూ నిలబడి అచ్చం తెలుగు సినిమాలోలా వీడ్కోలు చెప్పుకుంటున్నారు.

ఇలా ఎదుటివారి విషయంలోకి తొంగిచూడడం మర్యాద కాదని నాకూ తెలుసు. కానీ ఇప్పుడు పిడుగు నెత్తిన పడ్డా ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదు.

తల తిప్పి గోడవారగా బొద్దుగా వున్న ముద్దబంతుల వంక దృష్టి సారించాను. ఆ పక్కనే వున్న మందారాలు, పారిజాతాలు, చేమంతులు, పలకరింపుగా

నవ్వాయి రోజూ చెంబెడు నీళ్ళు పోసి ఎంతమంది స్నేహితులను సంపాదించుకున్నాను! ఈ అమాయక పూబాలలు ఎంత ఆహ్లాదకరమైన సాన్నిహిత్యాన్ని అందిస్తాయి! అయినా - ఇవన్నీ లేకపోయినా నేను ఒంటరిదాన్ని కాను. అందరూ నన్ను ఏకాకి అని అంటే అననీ! నేనా మాట ఒప్పుకోను కాక ఒప్పుకోను! నా జ్ఞాపకాలు నా ఒంటరి తనాన్ని ఎక్కడికో తరిమి కొట్టాయి. నా ఊహలు నా ఏకాకితనాన్ని ఎప్పుడో ఆక్రమించేశాయి. అందుకే నేనెప్పుడూ ఒంటరి దానిని కాను.

అయినా, మనసులో వున్న శూన్యతను ఎవరో పరాయి వాళ్ళు పూరించాలని ఎందుకనుకోవాలి? అది సాధ్యం కాదు కూడాను! ఎందుకంటే తన మనసును తనే అర్థం చేసుకోనివారు సాటివారి మనసుల్లోకి తొంగిచూడడం సాధ్యమవుతుందా? ముమ్మాటికీ సాధ్యమవదు!

నేను మళ్ళీ ఆ దినపత్రికలోని ప్రకటన వైపు చూపు మరల్చాను. పత్రికలోని వాక్యాన్ని మరోసారి చదివాను.

''...అన్యోన్యతకు మారుపేరైన, ఆదర్శప్రాయమైన ఈ దంపతుల అనురాగం కలకాలం విలసిల్లాలని ఆశిస్తూ...''

అప్రయత్నంగా నా మొహాన ఓ నవ్వు కదలాడింది.

ఆ నవ్వులోని శూన్యత నాకు స్పష్టంగానే తెలుస్తోంది.

నేను ఆ ఫోటోలోని వ్యక్తుల వైపు దీర్ఘంగా చూసాను. కళ్ళల్లోంచి... గుండెల్లోంచి సూటిగా వారి అంతరంగాల్లోకి !

ఆశ్చర్యంగా అప్పటిదాకా ఆ కాగితం మీద వున్న వారిద్దరూ ఒకరి తరువాత ఒకరు నా ముందుకొచ్చారు. నాతో స్వేచ్ఛగా, స్వచ్ఛంగా, స్పష్టంగా మాట్లాడటం మొదలుపెట్టారు. నేను శ్రద్ధగా, నిజాయితీగా వారి మాటలు ఆలకించాను.

అదేంటో గాని ఒకరు మాట్లాడేది వారిలో ఇంకొకరికి వినబడడం లేదు. నాకు మాత్రమే వారి కంఠాలు వినబడుతున్నాయి. వారి అంతరంగాలు కనబడుతున్నాయి. అంతరంగాలు కనబడడమేమిటని ఆశ్చర్యంగా ఉందా? నేను చూసిన దేమిటో మీకూ చూపిస్తాను. ఎందుకంటే ఏ విషయాన్ని గుర్తించడంలోనూ నేను ఒంటరిదాన్ని కావడం నాకు ఇష్టం లేదు.

వారి అంతరంగాలు వెల్లడి చేసిన విషయాలు వారి వ్యక్తిగతమైనవే కావచ్చు. నాతో చెప్పాక, మీతో పంచుకోకుండా ఎలా ఉండగలను?

**భానుమూర్తి**

నేను మా తల్లిదండ్రుల ఏకైక సంతానాన్ని అలాంటి నన్ను వారెలా పెంచి వుంటారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదుగా! వారి ముద్దు మురిపాలతోనే ఎప్పుడు యువకుడినయ్యానో ఎప్పుడు డాక్టరునయ్యానో తెలియకుండానే అయ్యాను.

అప్పుడు అమ్మానాన్నలకు అసలు సమస్య తలెత్తింది.

చక్కటి రూపం, చక్కటి చదువు, చక్కటి ఆర్థిక పరిస్థితులు, చక్కటి భవిష్యత్తు ఇక ఇప్పుడు వారికి కావలసింది వారు ఆశించేది చక్కటి కోడలిని మాత్రమే.

నాన్న నాకు చెప్పి కొందరినీ, చెప్పకుండా కొందరినీ చూశాడు.

కొందరు అమ్మకు నచ్చితే నాన్న కంటి కానలేదు. నాన్న బ్రహ్మాండమైనదని తీర్మానించినదనివాటిని అమ్మ చప్పరించేది. వారిద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చిన అమ్మాయి సంబంధం నాకు అంతగా నచ్చేది కాదు.

ఆ రాబోయే చక్కటి కోడలు చక్కటి సంపదను కూడా వెంట తీసుకురావాలి మరి! మొత్తానికి నా బయోడేటా-ఫోటోతో సహా ఆంధ్రదేశమంతటా చుట్టి వచ్చింది. నాకు మా సంబంధీకుల్లో ఎవరూ ఊహించనంత గొప్ప సంబంధం వస్తుందని అమ్మా నాన్నల భావన. నేను కూడా ఎన్నో ముఖ్యమైన సెమినార్లను, సెషన్లను వదులుకొని మరీ వాళ్ళననుసరించేవాడ్ని.

నేనో ఇంటివాడని కాలేదు కానీ, డాక్టరు డిగ్రీ తీసుకోవడం- ఆ సంవత్సరమే పి.జిలో చేరడం అన్నీ జరిగిపోయాయి. నా స్నేహితులు, చూస్తుండగానే ఒంటిగాళ్ళు కాస్తా జంటగాళ్ళు అయిపోయారు. నేను ఏ రాజమండ్రి నుంచో స్వయంవర యాత్ర చేసి తిరిగి వచ్చినప్పుడల్లా - వారంతా పనిగట్టుకుని ఓ సమావేశమేర్పరచి నన్నాటలు పట్టించేవారు.

నేను ఎం.డి అవడమూ ముప్పైకి మూడునెల్ల దూరంలోకి రావడమూ ఒకేసారి జరిగాయి.

శరత్, నేనూ ఒకేసారి ప్రాక్టీసు మొదలుపెట్టాం.

శరత్ భార్య మాలతి స్నేహమయి. శరత్ మిత్రబృందంలోనూ, చుట్టాల్లోనూ మంచి పేరు సంపాదించింది. నా ఆప్తులూ, ఆత్మీయులూ వారిద్దరే. వారిద్దరిలోనూ ఏదో ప్రశాంతత స్పష్టంగా కనిపిస్తుంది. వారిద్దరి సమక్షంలో ఆ ప్రశాంతత నన్నూ ఆక్రమిస్తుంది. ఉల్లాస భరితమైన ఆ క్షణాల కోసం నేను వారి దగ్గరికి తరచూ వెళుతుంటాను. నాతో పరాచికాలాడుతూ ఓ ఇంటివాడివి కమ్మని పోరుతూ ఉంటారు. నేను ఓ నిర్ణయానికి రాకముందే ఆ ముప్పై దాటి మూడేళ్ళు గడిచిపోయాయి.

నాకో అనుమానం వచ్చింది. అసలు నాకు ఏం కావాలో నాకు తెలుసా అని?

నా పెళ్ళిచూపుల అమ్మాయిల ఫోటోలతో ఓ ఆల్బమే నిండిపోయింది. నేను మరోసారి ఒక్కొక్కరినీ సావధానంగా పరిశీలించాను. వారిని మొదట

చూసినప్పుడు కనిపించిన లోపాలేవీ ఇప్పుడు కనిపించడం లేదు. గొప్ప సంబంధం మోజులో పడి వచ్చిన మంచి సంబంధాలన్నిటినీ చేజేతులా వదులుకున్నాని నాకు స్పష్టంగా అర్థమయింది.

నిజమే మరి! గొప్ప అనేదానికి నిర్వచనం మనం ఇచ్చుకొనేదేగా! ఇప్పుడు వారి గురించి వాకబు చేయమని అమ్మతో గానీ నాన్నతో గానీ ఎలా చెప్పడం? నేనిక పెళ్ళి చేసుకుంటాను అని చెప్పడానికి ఆడపిల్లలే కాదు మగవారూ బిడియపడతారని నాకప్పుడే తెలిసింది.

ఓ రోజు ఉదయాన్నే అమ్మ నా పక్కన కూర్చుని ఆ అమ్మాయిలందరి విషయాలు ఏకరువు పెట్టింది. దాదాపు అందరి పెళ్ళిళ్ళూ అయిపోయాయిట. అందరూ స్థిరపడ్డారుట. ఎటొచ్చీ తనదే తాడూ బొంగరం లేని జీవితం అయిపోయిందట. సాధ్యమైనంత త్వరలో నేనో నిర్ణయానికి రావాలట.

నేనేమనగలను?

నా మనసులో మాట ఆవిడ చెప్పింది.

నేను మౌనంగా తలాడించి క్లినిక్కు వెళ్ళిపోయాను.

మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి, జగన్నాధం మామయ్య వచ్చి ఉన్నాడు. నేను ముక్తసరిగా పలకరించి నా పనిలోకి నేను వెళ్ళిపోయాను.

నా మీద ఓ పెద్ద గూడుపుఠాణి జరుగుతోందని సాయంత్రం అమ్మ హెచ్చరించేదాకా నాకు తెలియదు.

''నిరుపమ అంటే ఇష్టం లేకపోతే స్పష్టంగా చెప్పెయి. నా మేనకోడలని నాకేదో ప్రత్యేకాభిమానం వుంటుందని నువ్వు మొహమాటం ఏమీ పెట్టుకోవద్దు!'' అంది అమ్మ.

నాకు వెంటనే విషయం అర్థమైంది. మామయ్య నిరుపమ విషయం ప్రస్తావించడానికి వచ్చాడన్న మాట, కానీ ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడమే! హమ్మో!!

నిజానికి తనకు మొట్టమొదట వచ్చిన సంబంధమూ అదే. మేనరికం. పైనుంచి ఈడుజోడూ కుదురుతుంది. అయితే అమ్మ ససేమిరా ఇష్టపడలేదు.

సరోజత్తయ్య కోడలిగా అమ్మమ్మగారింటికి రావడం-జగన్నాధం మామయ్యను పిడికిట్లో బిగించడం-తాతయ్యను, అమ్మమ్మను నిర్లక్ష్యం చేసి క్షోభ పెట్టడం-అప్పటికి తక్కువ స్థితిలో ఉన్న అమ్మను తీవ్రంగా అవమానించడం ఈసడించడం సాధించడం అమ్మ మరిచిపోలేదు.

జగన్నాధం మామయ్య మంచి ప్రభుత్వోద్యోగంలో వున్నాడు. జీతం మామయ్య పుచ్చుకుంటే గీతం అత్తయ్య పుచ్చుకుంటుంది.

మామయ్య ఇష్టా ఇష్టాల ప్రమేయం లేకుండా అన్నీ ఆవిడే సమర్థిస్తుంది.

అహంభావి. నోరుగలావిడగా ప్రసిద్ధి. నిరుపమ తల్లిగుణాలను పుణికి పుచ్చుకుంది. మామయ్య మంచితనం చేతగానితనమని వారి ఉద్దేశం.

మామయ్య ఎవరు ఏమనుకున్నా నోరెత్తడు. బీదాబిక్కీ చూడకుండా అత్తయ్యపై సంపాదనను ముక్కుపిండి వసూలుచేస్తుంటే చూస్తూ ఎలా ఊరుకుంటాడో! సొంత చెల్లెలిని ఇంటికి పిలిచే ధైర్యం కూడా చేయడు. ఎప్పుడైనా తనే వచ్చి పోతాడు. అదీ రహస్యంగా!

అందుకే మొదటిసారి అత్తయ్య మధ్యవర్తితో కబురు చేసినపుడు నేను అమ్మతో అమ్మ అతనితో ఒకే మాట చెప్పారు. 'అమ్మో ఆ అమ్మాయి మాట పెళుసు. చేయి దురుసు. వీడేమో మెత్తనివాడు. వద్దే వద్దు బాబోయ్!'' అంటూ.

అయితే, మామయ్య, నాన్న మంచి స్నేహితులు.

అత్తయ్యకు తెలియకుండానే వారి స్నేహం కొనసాగుతోంది. అది వట్టి స్నేహమేనని తనూ, అమ్మా ఇన్నాళ్ళు అనుకున్నారు. కాదు గట్టిస్నేహమని ఇద్దరూ ఒక్కసారే ప్రకటించారు. ఎలాగంటే...నా చదువుకి కావలసిన డబ్బాదస్కం ఆయన సమకూర్చేడట. నాన్న ఆ డబ్బుని అప్పుగా తీసుకున్నానన్నాడు. ఆడపిల్ల వుంది కదా అని ఇచ్చానన్నాడు మామయ్య.

వారి సంభాషణ రసవత్తరంగా సాగుతుంటే, అమ్మ నాన్నను పక్కకు పిలిచి చెప్పింది. ఈ రాజకీయమంతా ఖచ్చితంగా అత్తయ్యదే అయి వుంటుంది. ఆ డబ్బేదో ఆవిడ మొహాన కొట్టమంది. నాన్న నీళ్ళు నమిలాడు.

మామయ్య కాసేపటి తరువాత తనే అన్నాడు - ఆ డబ్బుని నిరుపమ పెళ్ళికి సిద్ధం చేసుకున్నారట. ఒకవేళ నిరుపమని నేను చేసుకోకపోతే ఆ డబ్బు వెంటనే తిరిగి ఇవ్వవలసిందని - దానికి మరింత జోడించి నిరుపమకి మరో సంబంధం చేస్తానని అన్నాడు.

నాన్న తెల్లమొహం వేశాడు. వున్నపళాన అంత డబ్బు ఎక్కడినుంచి తేగలడు? ఆ రాత్రి మర్నాటి పగలు ఇద్దరూ ఏదో తీవ్రంగా చర్చిస్తూనే వున్నారు. చివరకి సాయంత్రం మామయ్య బయల్దేరి వెళ్ళిపోయాడు - నగుమోముతో!

క్లినిక్కి బయలుదేరబోతున్న నా చేతిలో నిరుపమఫోటో పెట్టాడు నాన్న. నిరుపమ మునుపటి కన్నా ఎంతో మారిందట. అద్భుత సౌందర్యవతిట. గుణవంతురాలుట. అన్నిటికీ మించి నాకు మంచి జోడవుతుందిట. నాన్న ఏవేవో చెపుతూనే వున్నాడు.

నాకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదు.

నిన్నటిదాకా అదేపనిగా తెగిడిన నోరే ఈ రోజు పొగడ్తలతో ముంచెత్తుతోంది. అంతా లక్ష్మీప్రభావం!

నేను మౌనంగా ఆ ఫోటోను జేబులో పెట్టుకొని వెళ్ళిపోయాను.

క్లినిక్ అవగానే తిన్నగా శరత్ ఇంటికి వెళ్ళాను. అప్పుడే భోజనాలకి కూర్చోబోతున్నారు. మాలతి నన్నూ భోజనానికి సాదరంగా ఆహ్వానించింది. భోజనాలయ్యాక అలవాటు ప్రకారం జేబులోంచి కర్చీఫ్ తీశాను - చేతులు తుడుచుకోవడానికి.

దాంతో పాటు నిరుపమ ఫోటో కిందపడింది. శరత్ గబుక్కున అందుకున్నాడు. ఇద్దరూ ఒకరి తరువాత ఒకరు ఫోటోను పరిశీలించారు. తనను ఆటలు పట్టించారు. ఇంతలో ఊర్నించి మాలతి తమ్ముడు శేఖర్ వచ్చాడు. రాగానే టీపాయి మీదున్న ఫోటోను చూసి, ఆశ్చర్యంగా చేతిలోకి తీసుకున్నాడు.

ఈ అమ్మాయి ఫోటో ఇక్కడెందుకుందని అడిగాడు.

మాలతి నవ్వుతూనే అంది. 'ఏం నీకు తెలిసినట్లే ఆరా తీస్తున్నావే?''

''తెలుసు కాబట్టే అడుగుతున్నాను. ఎందుకంటే ఈ అమ్మాయి మా గదిలో వారం రోజులుంది! తెలుసా!'' శేఖర్ వేగంగా అన్నాడు. అంతే! అందరి నవ్వులు తుడిచిపెట్టినట్లు మాయమయ్యాయి.

శేఖర్ తిరుపతిలో మెడిసిన్ చదువుతున్నాడు.వాళ్ళ కాలేజీకి దగ్గర్లోనే ఓ గది తీసుకున్నాడు. అతనితోపాటు మరో ఇద్దరు బ్యాచిలర్స్ వుంటారు. అక్కడ నిరుపమకేం పని?

మాలతి ఆశ్చర్యం అణచుకుంటూ అంది, 'నీ తలకాయ్! ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నావో! అసలా అమ్మాయి ఎవరంటే...''

''నిరుపమ! వుమెన్స్ కాలేజీలో ఇంటర్ చదివింది. డిగ్రీ కో- ఎడ్‌లో. వయస్సు ఇరవైనాలుగు, ఇరవై అని చెపుతుంది. ఎత్తు అయిదున్నర, బరువు...''

''ఇంకాపు! ఇంతకీ నువ్వనేదేమిటి?'' శరత్ కంఠం ఖంగుమంది.

''ఏముందీ అనడానికి? ఆ అమ్మాయి అష్ఫాక్‌తో పాటు మా గదికి వచ్చింది. వాళ్ళిద్దరూ మా గదిలో వున్నప్పుడు నేను, వినోద్ హాస్టల్‌కి వెళ్ళాం. ఆమెను తిరిగి సాగనంపాక మా రూంకి వెళ్ళాం!''

''ఓ ఆడపిల్ల గురించి మాట్లాడేముందు మంచీచెడూ ఆలోచించి జాగ్రత్తగా మాట్లాడు శేఖర్! వేళాకోళాలొద్దు!'' మాలతి కళ్ళు పెద్దవి చేసి అంది.

''వేళాకోళం కాదక్కా! నిజం! నిజంగానే నిరుపమ మాగదిలో వారం రోజులుంది!''

''అష్ఫాక్‌తో ఆమెకు ఏమిటి సంబంధం?'' నా గొంతు పీలగా పలికింది.

''ఏం సంబంధమో నేను స్పష్టంగా చెప్పలేను. ఇద్దరూ కలిసి ఉంది మాత్రం నిజం!''

శరత్, మాలతి రకరకాలుగా ప్రశ్నించి శేఖర్‌ను వేధించారు.

శేఖర్ ఒకటే మాట బల్లగుద్ది చెపుతున్నాడు.

నా చెవులు మొదటిసారి చెప్పినప్పుడే బండబారిపోయాయి.

దానికి తోడు ఇంటికి వెళ్ళగానే అమ్మ నిరుపమతో మరో రెండు రోజులలో నిశ్చియతార్థం నిశ్చయించారని చెప్పింది. నాన్న హడావిడిగా ఆ పనుల్లో పడ్డాడట.

ఇంకా నేనో స్థిరమైన అభిప్రాయానికి రాకముందే నా పెళ్ళి నిర్ణయించేశారు!

నేను అమ్మతో విషయమంతా చెప్పాను.

ఓ పరాయి వ్యక్తితో వారం పాటు ఒంటరిగా కలిసి వున్న అమ్మాయితో జీవితం పంచుకునేంత సహృదయత నాకు లేదని స్పష్టంగా చెప్పేశాను. నేను నాన్న చాటు పిల్లాడిలా ఆయన నిర్ణయాలకు తలవంచి తీరాలా? నాలాంటి యోగ్యుడైన యువకుడికి సంబంధమే దొరక్కపోతుందా?

నిరుపమ కాకపోతే మరో అనుపమ!

**నిరుపమ**

భానుతో సంబంధం మాట్లాడమని అమ్మ నాన్నను రాయబారానికి పంపింది. నిజానికి అమ్మ అత్తయ్యవాళ్ళ గడప ఎక్కి చేయి చాచేదే కాదు. అక్క పెళ్ళి అయినప్పటి నుండి అమ్మలో నా గురించి ఏదో భయం, దిగులు మొదలయింది. ఓ నిర్ణయానికి రాలేకపోతోంది.

మా ఇంట్లో మొదటి నుంచీ ఏ విషయంలోను నాన్న ఎప్పుడూ నోరు విప్పడు. కుటుంబంలో ఆయన యిష్టాయిష్టాలను ఏనాడూ చెప్పిన పాపాన పోలేదు. పాపం . అమ్మే కష్టమూ నష్టమూ భరించాలి.

అమ్మ చేతిలో డబ్బు పోయడంతో నాన్న పని అయిపోతుంది. ఆ తరువాత అమ్మ ఎంత నేర్పుగా, ఎంత తెలివిగా చక్కబెడితే పనులు సకాలంలో సక్రమంగా జరుగుతున్నాయి! మేము కాస్త పచ్చగా కళకళలాడుతూ వున్నామంటే అది అమ్మ ముందుచూపు వల్లే!

అక్క సంబంధం నిర్ణయించడంలో అమ్మ పొరపాటు పడింది. బావ ధనవంతుల ఏకైక సంతానం. అక్క అంతులేని సంపదకు అధికారిణి అవుతుందని అమ్మ ఆ సంబంధం ఒప్పుకుంది.

కానీ బావదో రకం మనస్తత్వం. అక్కను ఓ సామాన్య గృహిణి ఉండేట్లుగానే ఉండమంటాడు. ఆయన అలాగే ఉంటాడు. వున్న డబ్బును జల్సాగా వాడుకోవడానికి ఆయనకు మనసు వప్పదు. అమ్మసలహాలకు చెవి ఒగ్గలేదు. అక్క కూడా బావ మాటలజాలంలో పడిపోయింది. అమ్మను పట్టించుకోవడం తగ్గించేసింది.

అమ్మకలలన్నీ కల్లలయ్యాయి. కూతురు భోగభాగ్యాల మధ్య తూగులాడడం

కన్నా ఏ తల్లైనా కోరుకునేది ఏముంటుంది చెప్పండి. అంతటి ఉన్నత స్థాయికి వచ్చా కష్టపడాల్సిన అవసరం లేదని అమ్మ వాదన. కష్టపడందే ఆ స్థాయి నిలుపుకోలేం అంటాడు బావ. ఈ సారి అలాంటి పిసినిగొట్టు అల్లుడిని గాని, తను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళని వాదించే అల్లుడిని గాని వద్దనుకొంది అమ్మ. ఇద్దరు అల్లుళ్ళలో ఒక్కరైనా ఒద్దికగా లేకపోతే ఎలా?

అదేంటో గాని అమ్మకు నాకు వచ్చిన ఏ సంబంధమూ నచ్చలేదు. ఇప్పుడు వరుణ్ణి నిర్ణయించడం డబ్బున్నఆడపిల్లవాళ్ళ చేతిలో వుందని కాస్త అటు ఇటూ కావలసిన లక్షణాలతో వున్న యువకుడు దొరికేదాకా వేచి ఉండాలే కానీ రాజీ పడనవసరం లేదని అమ్మ అంటుంది.

ఎన్నో సంబంధాలు వచ్చాయి. ఓ నిర్ణయానికి రాకముందే వెళ్ళిపోయాయి.

నాకూ పాతికేళ్ళు వచ్చాయి. వెళ్ళాయి. చివరికి అమ్మ దృష్టి భాను మీద పడింది. ఒక యం.డి. డాక్టరు! బంగారు బాతు! అలాంటిదే బయటి సంబంధమైతే వాళ్ళగొంతెమ్మ కోర్కెలు తీర్చడం సాధ్యమయ్యేనా? అందులోను భాను చాలా మెతక. దాదాపుగా నోట్లో నాలుక లేనట్లే. అయినవాళ్ళ అబ్బాయి కనుక కాస్త అణుకువగా వుంటాడని అమ్మ ఆలోచన. అయితే అత్తయ్యతో మాకున్న సాన్నిహిత్యం తక్కువ. అమ్మ ముందుచూపుతో ఆవిడ రాకపోకలను, పెట్టుపోతలను అదుపులో ఉంచింది. లేకపోతే ఇప్పటిదాకా నాన్న సంపాదనంతా ఆవిడ శుభాశుభాలకే చెల్లిపోయేది. ఇప్పుడు తాము పైమెట్టు మీద నిలబడి భానుతో పెళ్ళి రాయబారాలు జరుపగలిగే వారేనా?

అమ్మ ఏమనుకుందో ఏమో గాని స్వయంగా వెళ్ళి అత్తయ్యను కలవడానికి గానీ, విషయం ప్రస్తావించడానికి గానీ, ఇష్టపడలేదు. కానీ మాట్లాడవలసినదంతా నాన్నకే చెప్పి పంపింది. మామయ్య మొదట్లో కాస్త నసిగినా పెళ్ళికి ఒప్పుకున్నాడట. నిశ్చితార్థం కూడా నిర్ణయించేశారు.

అత్తయ్య మాత్రం అమ్మ కనీసం రానన్నా రాలేదని మనసు కష్టపెట్టుకుందిట. ఇప్పుడు వ్యవహారం ఆవిడ చేతుల్లో లేదుగా ఆవిడ నిష్ఠూరాలను గూర్చి ఆలోచించడానికి.

అమ్మ మామయ్య నసాలాన్నంటే ఉపాయాన్ని చెప్పి పంపింది నాన్నకి! చచ్చినట్లు పెళ్ళికి ఒప్పుకున్నారు! ఒప్పుకోక ఏం చేస్తారు?

అన్నీ అనుకున్నట్లే సవ్యంగా జరిగి పోతున్నాయి.

అమ్మ మర్నాడు చీరలు తేవడానికి కంచికి వెళదామని నిర్ణయించింది. నాన్న ఎ.సి. కారు సిద్ధం చేయించాడు.

ఉదయాన్నే పిడుగులాంటి వార్తతో మామయ్య ఊరినుంచి ఊడిపడ్డాడు.

భానుకు నాతో పెళ్ళి ససేమిరా ఇష్టం లేదట!

ఎంత ధిక్కారం! ఎంత అవమానం!!

**భానుమూర్తి**

నాన్న ఉదయాన్నే వెళ్ళి మామయ్యవాళ్ళతో నేను పెళ్ళి వద్దన్న విషయం చెప్తానన్నాడు. ఎందుకు వద్దన్నాడో మాత్రం చెప్పడట.

ఏ క్షణాన్నైనా వాళ్ళంతా నా దగ్గరికి సంప్రదింపులకి రావచ్చు. ఈ లోపల నేను పటిష్టమైన వాదనను సాక్ష్యాలతో సహా సిద్ధం చేసుకొనివుండాలి. లేకపోతే వాళ్ళమాటల జాలంలో తను సులువుగా చిక్కిపోతాడు. తను అసలే మాటకారి కాడు.

లేచీలేవకుండానే గబగబ తయారయ్యి ఇంట్లోంచి బయటపడ్డాను. తిన్నగా శరత్ దగ్గరికి వెళ్ళాను.

శరత్ ఉదయపు ఉపాహార కార్యక్రమంలో వున్నాడు. ఉదయాన్నే ఊడిపడ్డందుకు ఆశ్చర్యపోతూనే విషయం ఏంటని ఆరా తీసాడు.

నేను నిరుపమను తిరస్కరించిన విషయం చెప్పేసాను.

మాలతి లోపల పనిచేసుకుంటున్నదల్లా బయటకు వచ్చి, మా వద్ద కూర్చుంది.

నేను ఏకరువు పెట్టిందంతా ఇద్దరూ సావధానంగా విన్నారు.

''నిజానిజాలు తెలుసుకోకుండా తొందరపడి అభాండాలు వేయబోకండి. ఆడపిల్లపెళ్ళి నిశ్చితార్థం దాకా వచ్చి ఆగిపోయిందంటే.. తరువాతి పరిణామాలు చాలా తీవ్రంగా వుంటాయి'' మాలతి నెమ్మదిగా అంది.

''నేను, నువ్వు నిరుపమని పెళ్ళిచేసుకోవాలా వద్దా అన్నది తీర్మానించిచెప్పలేను. కానీ... ఓ అనుమానంతో మొదలయ్యే వివాహబంధం ఏనాటికీ పటిష్టం కాబోదు. నమ్మకమే వైవాహికజీవితాన్ని సుఖమయం చేసే అంతః సూత్రం. అనుబంధం ఏర్పడడానికి అభిమానమే వుండాలి కానీ అనుమానం వుండకూడదు. కాబట్టి నువ్వో నిర్ణయానికి వచ్చే ముందు మనసులోంచి అ అనుమానాల్ని పూర్తిగా తుడిచేసేయి!'' అన్నాడు శరత్ గంభీరంగా, మాలతి, శరత్ చాలాసేపు ఏవేవో మాట్లాడారు.

నా తల తిరిగిపోయినట్లయింది. తన పాటికి తను ఈ పెళ్ళివద్దని కుండబద్దలు కొట్టి మరీ చెప్పేసాడు. నిరుపమకు గానీ వారి కుటుంబానికి కానీ ఎదురవ్వబోయే కష్టనష్టాల గూర్చి రవ్వంతైనా ఆలోచించాడా? అయినా అంత పెద్ద తప్పును దాచి పెట్టి పెళ్ళి చేయాలనుకుంటున్న వారిని గూర్చి తను ఇంతలా ఆలోచించాలా? వాళ్ళు ఎట్లా పోతే తనకేం? ఏ ఏట్లో దూకితో తనకేం? కానీ... ఒక వేళ మాలతి అన్నట్లు అదంతా కేవలం ఏ

నీలి ప్రచారమో అయితే తను నిరుపమకి... ఓ ఆడపిల్లకి అన్యాయం చేసినట్లుకాదూ? ఆమె ఉసురు తనకు తగలకుండా వుంటుందా? ఆ పాపం తనకెందుకు?

వాళ్ళు చెపుతున్నట్లుగా ముందు విషయాన్ని స్పష్టపరుచుకొని - ఒక వేళ నిరుపమ నిర్దోషి అయితే ఆమెనే పెళ్ళాడతాను. అభ్యంతరమేముంది?

నేనో నిర్ణయానికి వచ్చి, శరత్ వద్దనుండి శేఖర్ చిరునామా తీసుకొని బయట పడ్డాను.

బహుశా నాన్న జగన్నాథం మామయ్య ఇంటికి, నేను శేఖర్ రూంకి దాదాపు ఒకేసారి చేరి వుంటాం.

శేఖర్ నన్ను సాదరంగా ఆహ్వానించాడు. శేఖర్ తన ఫ్రెండ్ వినోద్‌ని పరిచయం చేసాడు. పిచ్చాపాటి అయ్యాక - నేను నిరుపమ విషయం ఎత్తాను.

''వ్వాట్! మీరా అమ్మాయిని నిజంగానే పెళ్ళి చేసుకుంటారా? శేఖర్ అంటుంటే ఏదో వేళాకోళానికి అంటున్నాడను కొన్నాను!'' వినోద్ అరిచినంత పని చేసాడు.

అష్ఫాక్ ఇప్పుడు వీళ్ళతో వుండడం లేదు. హైదరాబాదులో ఏదో ప్రైవేటుకంపెనీలో ఉద్యోగం వస్తే చేరిపోయాడట.

వినోద్ కూడా శేఖర్ చెప్పిన సంగతే చెప్పాడు. రెండవ సాక్ష్యం! నామెదడు మొద్దుబారిపోయింది. వీళ్ళకి కట్టుకథలు చెప్పాలసిన అవసరం ఏముంది? అందులోను శేఖర్ స్వయాన మాలతి తమ్ముడు. శరత్‌ని గౌరవించినంతగా తననూ గౌరవిస్తాడు. పనికట్టుకొని అబద్ధాలు చెప్పడు కదా?

నిరుపమ కాలేజీలోనే చదివి ఇప్పుడు యూనివర్సిటీలో రీసెర్చి చేస్తోన్న ఓ అమ్మాయి దగ్గరికి తీసుకెళ్ళాడు శేఖర్. ఆ అమ్మాయితో పరిచయాలవీ అయ్యాక - శేఖర్ నిరుపమ ప్రస్తావన ఎత్తాడు. ''నిరుపమా? ఆ అమ్మాయి ఎవరికి తెలియదు! మా కాలేజీకి ప్రెసిడెంట్‌గా వుండేది. చాలా డామినేటింగ్ నేచర్!''

''అంటే?''

''అందరి మీదా పెత్తనం చేయాలనీ, తన మాటే చెల్లాలనీ మహా పట్టుదల. చాలా మొండిగా ప్రవర్తించేది. తల బిరుసు. అబ్బాయిల్ని అస్సలు లెక్కచేసేదే కాదు. ఎవరైనా సరదాకి ఓ చిన్నమాటన్నా చాచి లెంపకాయ కొట్టేది. మా సీనియర్లలో ఒక అబ్బాయి అనుకుంటాను... తిరిగి కొట్టాడు!''

''ఎవరు? ఎవరతను?'' నేను ఆత్రంగా అడిగాను.

''ఎవరో ముస్లిం కుర్రాడనుకుంటా, నాకు పేరు జ్ఞాపకం రావట్లేదు. అవునూ... ఈ వివరాలన్నీ మీకెందుకు?'' ఆమె హఠాత్తుగా అడిగింది.

నేనా విషయం పట్టించుకోనట్లే అడిగాను... "ఆ అబ్బాయి అష్వాక్ కాదుకదా?" "తెలీదండి" అంది ఆ అమ్మాయి.

ఆ తరువాత ఇక మాట్లాడడానికేం మిగల్లేదు. ఈ ఆడవాళ్ళంతా ఒకటే! ఆ అమ్మాయికి నిరుపమ వెలగబెట్టిన ఘనకార్యమంతా తప్పక తెలిసే వుంటుంది! అయినా చెప్పకుండా దాటేస్తుంది!

చెప్పి చిక్కుల్లో పడడం ఎవరికి ఇష్టం వుంటుంది?

అష్వాక్‌ని నిరుపమతో అతని కున్న సంబంధం ఏమిటో కనుక్కోమని శేఖర్‌ను పురమాయించి నేను తిరిగి ఊరికి బయలు దేరాను.

ఒక్కో సాక్ష్యం నిరుపమ దోషిత్వాన్ని నిరూపిస్తున్నాయి.

తను ఇలాంటి అభిప్రాయాలతో ఆమెను పెళ్ళాడగలడా? అసాధ్యం!

**నిరుపమ**

ఎంత అవమానం! ఎంత అవమానం!!

నిన్నటి దాకా కనీసం తమ చుట్టుపక్కలకి రావడానికి కూడా సాహసించలేని భాను తనని అంత తేలిగ్గా తీసి పారేస్తాడా? అయినా తనని తిరస్కరించడానికి కారణాలేం దొరకలేదా? తన గతంలో గతం...తన అంతరంగంలో అంతరంగమైన అష్వాక్...

అష్వాక్ విషయం భానుకి ఎలా తెలిసి వుంటుంది? ఎవరు చెప్పివుంటారు? ఎవరో తెలుసుకోవాలి! ఎందుకంటే తననింత సంక్షోభంలో పడేసిన వారిని తేలిగ్గా వదలకూడదు!

అష్వాక్‌తో మొత్తానికి తన మీద ప్రతీకారం తీర్చుకొన్నాడు! ఎక్కడున్నాడో ఏమో కానీ మంచి సమయంలో దెబ్బ తీసాడు!

అష్వాక్ తన పరిచయం చాలా గమ్మత్తుగా జరిగింది. తను ప్రెసిడెంటుగా పోటీ చేస్తున్నప్పుడనుకుంటా మొదటిసారి కలిసింది. తనెరిగిన అబ్బాయిలందరూ పిరికి సన్నాసులు. తనంటేనే హడలి చచ్చేవారు. దద్దమ్మలు. అష్వాక్ ఒక్కడే ధైర్యంగా మాటకు మాట సమాధానం చెప్పేవాడు. ఓ సారి డిబేట్‌లో ఇద్దరి వాగ్వివాదాలు ఎంతకీ తెగకపోవడంతో ఇద్దరికీ సంయుక్తంగా ప్రథమబహుమతి ప్రకటించేసారు.

ఇద్దరం కాలేజ్ తరఫున యూనివర్సిటీ పోటీలలో పాల్గొనడానికి తిరుపతి వెళ్ళాం. ఆ ట్రిప్ తనలో ఎన్నో మార్పులు తెస్తుందని వెళ్ళేపుడు అసలు ఊహించలా!

అష్వాక్ తనని వాళ్ళ ఫ్రెండ్‌రూంకి తీసుకెళ్ళాడు.

మొదట్లో అష్వాక్‌ని పరాయి ఊళ్ళో నాకు సకల సౌకర్యాలను అమర్చే ఓ మంచి సేవకుడిని చూసినట్లే చూసాను. కానీ...

అష్పాక్‌తో రోజంతా కలిసి వుండడం - సరదాగా మాట్లాడడం - ఉల్లాసభరితమైన ఆ వాతావరణం - నాకు తెలియకుండానే అతన్ని సన్నిహితం చేసాయి.

నేను అతనికి మానసికంగా విధేయురాలినై పోయాను. డిబేట్‌లో యూనివర్సిటీ ఫస్టు మా జంటకే వచ్చింది.

ఎలెక్యూషన్‌లోనూ రెండువిభాగాల్లో మాకే ఫస్ట్! కవిత్వంలో అష్పాక్ రెండో బహుమతి తెచ్చుకున్నాడు.

ఈ విజయాలు వ్యక్తిగానే కాక కాలేజీ ప్రెసిడెంట్‌గా నాస్థాయిని పెంచేవి. ఆ సంబరంలో ఉద్వేగాన్ని అణుచుకోలేక గదికి రాగానే అష్పాక్‌ని పట్టి ఊపేసాను. ఆ ఊపు వేగానికి అతని మీదికి వాలిపోయాను. నాకు తెలీకుండానే! అష్పాక్ నివ్వెరపోయాడు.

మొదటిసారిగా నాజీవితంలో పురుష స్పర్శ! అష్పాక్ వాడిన స్ప్రే పలుచని సువాసన నాలో ఏదో మధుర భావనను కలుగజేసింది. నాలోని అహం మంచులా కరిగిపోయినట్లనిపించింది. ఎంత సేపలా వుండిపోయామో నాకు తెలీదు.

అష్పాకే మొదట తేరుకొని దూరంగా జరిగాడు. నేను లోకంలోకి వచ్చి పడ్డాను. అష్పాక్ జెంటిల్‌మాన్! కానీ... ఏదో అసంతృప్తి - అది మిగిల్చిన అలజడితో నేను దూరంగా జరిగాను.

మళ్ళీ ఎప్పటి నిరుపమని అయ్యాను. మళ్ళీ నా చూపుల్లోకి చురుకు, మొహంలోకి కరుకు వచ్చేసాయి.

అష్పాక్ నా సూట్‌కేస్ మోస్తూ - వినయంగా నాముందు నడుస్తోంటే - నేను వెళ్ళి రైలెక్కాను.

ఆ తరువాత అష్పాక్ ఎన్నో మార్లు నాతో రాయబారం జరపాలని ప్రయత్నించాడు. అమ్మ నేర్పిన వాస్తవధృక్పథం తనను కాపాడింది.

ఎందులోనూ తమకి సరితూగని అతనితో సంబంధమా? సాధ్యపడదు. ఎవరో అభ్యంతర పెడతారని కాదు. తనకే ఇష్టం లేదు. అందుకే అష్పాక్‌తో స్పష్టంగా తేల్చి చెప్పేసాను - నాకలాంటి ఉద్దేశమే లేదని.

అష్పాక్ ప్రాధేయపడ్డాడు. పిచ్చివాడిలా అయిపోయాడు.

నేను మాత్రం చొరవ ఇయ్యలేదు. బాబోయ్...పోయిపోయి ఆ అణాకానీ జంజాటంలో పడడమా?

అష్పాక్ ఎక్కడో ఓ చిన్న ఉద్యోగం చూసుకొని ఊరొదిలి వెళ్ళి పోయాడు. ఏదో ఓ అనుభవం కారణాన జీవితాంతం అలాంటి ఎదుగూ బొదుగూ లేని వాడితో పడి వుండాలా? అందుకే నా నిర్ణయం సరైనదేనని తృప్తిపడ్డాను.

కానీ, అష్ఫాక్ అంటే తనకి అప్పటికీ అభిమానమే! ఎందుకంటే ప్రతి వెధవా నన్ను చూసి పారిపోయేవాడే. అష్ఫాక్ మాత్రం తన దగ్గరకి రప్పించు కొన్నాడు - సెకనులో వెయ్యోవంతైనా!

కానీ, ఇప్పుడా వ్యవహారాన్ని అందరికీ వివరించి చెప్పాలా? క్షమాపణలు వేడుకోవాలా? ఒకరి ముందు తలవంచి మాట్లాడడం తను ఎరుగనే ఎరుగదు. అహం చంపుకొని నేనా పని చేయాలా? అన్ని విధాల అనువైన సంబంధాన్ని వదులుకోవాలా? సౌఖ్యమైన భవిష్యత్తు మీద నీళ్ళు చిలకరించాలా?

బాగా ఆలోచించి ఏం చేయాలో నేనో నిశ్చయానికి వచ్చాను.

అత్తయ్యవాళ్ళు నాన్నలాగే చాలా మెతక మనుషులు. భానుని ఒప్పించడం ఎంతసేపు? మామయ్య విషయం చెప్పడానికి ఎంత మధన పడ్డాడు! భాను ఏదో అన్యాయం చేసినట్లు చెప్పలేక చెప్పాడు!

నిజానికి భాను తప్పేం వుంది? ఎవరైనా ఇలాంటి పరిస్థితి ఎదురైతే అలానే ప్రవర్తిస్తారేమో! అందరూ కోరుకొనేవి అనాఘ్రాత పుష్పాలనేగా?

నేను మెల్లిగా మామయ్య దగ్గరకి వెళ్ళాను. ఆయన నా వైపు సూటిగా చూడనైనా చూడలేకపోతున్నాడు.

ఏడుపు, బాధ మిళితం చేసిన గొంతుతో ఆయన్ని కదిలించేలా అన్నాను. ''మామయ్యా...నిజంగా నాలో పొరపాటేమైనా వుంటే నిలువునా పాతేయండి! ఒక్కసారి... ఒక్కసారంటే ఒక్కసారి... బావని నాతో మాట్లాడమనండి!'' అంటూనే భోరున ఏడ్చేసాను.

నాతో పాటే మామయ్య ఏడ్చేసాడు.

''నువ్వెందుకే ఏడుస్తావ్? నీకేం ఖర్మని! నిప్పులాంటి పిల్లని అంత వగాటంటాడా? ముప్పై పైవయసే ! ఈ కాలం కుర్రాళ్ళు వండి కట్టుక్కూర్చుంటారని ఎవరన్నా అనగలరా? పదేళ్ళపైనే హాస్టల్లో వున్నాడు. ఏవేం చేసాడో, ఎవరెవరితో తిరిగాడో, ఎన్ని సలక్షణాలున్నాయో మేమేమయినా ఆరాతీసామా? ఏదో ఆడపడుచుకొడుకని చూసామే కానీ...!'' అమ్మ విరుచుకు పడింది.

నాన్న అదేమాటను కాస్త సున్నితంగా అన్నాడు.

మామయ్య అపరాధిలా తలదించుకొని వెళ్ళాడు.

''ఎందుకే భానుని రమ్మన్నావ్? ఏం మాట్లాడదామని!'' అమ్మ కంఠంలో అనుమానం స్పష్టంగా ధ్వనిస్తోంది. అమ్మకు అష్ఫాక్ తెలుసు!

''నువ్వే చూడు!'' నేను పకపక నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయాను.

నామీద నాకున్న విశ్వాసానికి ఓ క్షణం నాకే ఆశ్చర్యం వేసింది.

ఇప్పుడే ఏడ్చి, అందరినీ ఏడ్పించిన నేను ఏమీ జరగనట్టే నవ్వుతూ వెళ్ళడం ఎవరూ పట్టించుకోలేదు. నాన్న కళ్ళల్లో మాత్రం ఆశ్చర్యం కదలాడింది. దాని వలన నాకొచ్చే నష్టం ఏమీలేదు!

నేను బావతో ఏం మాట్లాడబోతున్నానో ఎవరితోనైనా ఎందుకు చెప్పాలి? కొన్నిసార్లు చెప్పి చెయ్యడం కన్నా చేసి చెప్పడం బావుంటుంది. ముఖ్యంగా ఇలాంటి కీలక సమయాల్లో!

### భానుమూర్తి

నాకు ఎందుకనో క్లినిక్కి వెళ్ళాలనే అనిపించలేదు. నాన్న ఇంకా రాలేదు. నేను శరత్ వాళ్ళింటికి వెళ్ళాను.

శేఖర్ దగ్గరికి వెళ్ళి నేను తెలుసుకొని వచ్చిందంతా చెప్పారు. శరత్ నా నిర్ణయమేమిటని అడిగాడు.

నేను నిరుపమని పెళ్ళి చేసుకొనే ప్రసక్తే లేదన్నాను.

కానీ నాలో ఏదో అపరాధభావన స్పష్టంగా కనిపిస్తుందన్నాడు శరత్. ఎందుకని? తప్పు చేసింది నేను కాదుగా! మరి అపరాధం చేసినట్లు నేనెందుకు మథనపడతున్నాను? అయిన వాళ్ళ అమ్మాయి అలా చేసి వుంటుందని నమ్మలేకపోతున్నానా? ఏమో? కారణమేమిటో తనకే తెలియదు.

పైకి తేలిగ్గా నవ్వేసి అలాంటిదేం లేదన్నాను.

కాసేపటికి మరికొందరు స్నేహితులు వచ్చారు.

అందరితోనూ నిరుపమ అంటే తనకెందుకు ఇష్టం లేదో - చిన్నప్పటి నుంచి నిరుపమ ఎంత పెంకిగా, పొగరుగా ప్రవర్తించేదో - అందరినీ ఎలా తీసిపారేసినట్లు మాట్లాడుతుందో - తక్కువ స్థాయి వాళ్ళంటే ఎంత చులకనో - అన్నీ ... అన్నీ .... కళ్ళకు కట్టినట్లు చెప్పాను.

ఒక విధంగా నేను మళ్ళీ ... మళ్ళీ .... అన్ని కోణాల్లోంచి ... నిరుపమని తిరస్కరించడానికి కారణాలు వెతికి చూసాను. వారికి చూపాను. నా తప్పేమీ లేదని నన్ను నేను ఒప్పించుకోగలిగాను. ఆ సంబంధం తప్పిపోవడమే మంచిదని అందరి చేత అనిపించాను.

నాకు ఎక్కడలేని బలము వచ్చింది. కాసేపు కబుర్ల తరువాత ఇంటికి బయలు దేరబోతోంటే శేఖర్ దగ్గర్నించి టెలిగ్రాం వచ్చింది. అప్పాక్ ఆ విషయాన్ని నిర్ధారించాడట!

నేనా కాగితాన్ని జేబులో పెట్టుకొని ఇంటికెళ్ళాను.

అప్పటికే నాన్న వచ్చాడు. ఇంట్లో ఏదో గంభీరత తాండవిస్తోంది. భోజనాలవీ అయ్యాక నాన్న మళ్ళీ ఆ ప్రస్తావన ఎత్తాడు. అనవసరంగా నిరుపమ మీద అభాండాలు వేసానన్నాడు. ఆ ఉసురు తనకి తగలకుండా పోదన్నాడు. ఇంకా

ఏవేవో అన్నాడు. నిరుపమే ఆయన కూతురయినట్లు నేను పరాయివాణ్ణయినట్లు మాట్లాడాడు.

అమ్మ మాత్రం నాన్న మాట్లాడవలసినదంతా మాట్లాడేదాకా ఏమీ మాట్లాడలేదు. ''భాను... ఇంతకు మునుపోసారి చెప్పాను. మళ్ళీ చెపుతున్నాను. ఆ అమ్మాయి నా మేనకోడలని నాకెలాంటి ప్రత్యేకాభిమానం లేదు. ఆమె మేనకోడలు మాత్రమే. నువ్వు నా కన్నకొడుకువి. నీకు ఏ మాత్రం కష్టం కలిగినా, నష్టం జరిగినా నేను భరించలేను. ఆ అమ్మాయి అనుకున్నది చేసి వుండదన్న నమ్మకం నాకు లేదు. ఏమైనా నువ్విలాంటి ఆలోచనలతో పెళ్ళి చేసుకోవడం మాత్రం మంచిది కాదు. నీకూ.... ఆ అమ్మాయికి కూడా!'' అమ్మ ఖచ్చితంగా చెప్పేసింది.

నాన్న ఆ అమ్మాయి ఎంత దుఃఖ పడిందీ వివరిస్తూ - నన్నోసారి కలుస్తానన్నదన్న విషయం చెప్పాడు. నేను ఒకసారి వద్దన్నాక వాళ్ళ గడపతొక్కే సమస్యే లేదన్నాను. నాన్న చాలా సేపు వాదించాడు. బతిమిలాడాడు. బెదిరించాడు. చివరికి నేను ఇంట్లోంచి బయట పడే దాకా ఆయన వాదన చేస్తూనే వున్నాడు.

నేను తిన్నగా శరత్ దగ్గరికి వెళ్ళాను. విషయమంతా వివరించాను. జేబులో వున్న టెలిగ్రాం నన్ను నిలవనీయడం లేదు. చివరికి - నా నిర్ణయాన్ని ఆ అమ్మాయితోనే కుండబద్దలు కొట్టినట్లు చెప్పేసి వద్దామన్న నిర్ణయానికి వచ్చాను.

శరత్ కూడా అదే సరైనదన్నాడు. ఎందుకంటే ఒకసారి మాట్లాడితే అవతలివారి నుంచి కూడా విషయాన్ని అర్థం చేసుకున్నట్లవుతుంది కదా! ఇప్పటిదాకా మనకు తెలిసింది ఒకవైపు విషయం మాత్రమే.

నేను అమ్మను కూడా రమ్మన్నాను. అమ్మ ససేమిరా రానంది. నాన్న, నేను బయలుదేరాం.

జగన్నాథం మామయ్య వాళ్ళింట్లో అడుగు పెట్టిన క్షణం నుండీ నాలో ఏదో అలజడి మొదలైంది. అందరూ నన్నో దోషిని చూస్తున్నట్లుగా చూస్తున్నట్లని పించింది. కుర్చీలో కూడా కుదురుగా కూర్చోలేకపోయాను.

చివరికి ఓ గదిలో నిరుపమ, నేను - ఒంటరిగా సమావేశమయ్యాం. ఎలా మొదలు పెట్టాలో నాకర్థం కాలేదు. నా గొంతు పెగలడం లేదు. సూటిగా నిరుపమ వైపు చూడలేక పోతున్నాను. నాకు నేను సర్దిచెప్పుకొన్నాను. తప్పు చేసింది నిరుపమ. నేనెందుకు తలదించుకోవాలి? ముఖం కఠినంగా పెట్టుకొని - గంభీరంగా అన్నాను.

''ఏంటో మాట్లాడాలన్నారట!''

''నన్ను పెళ్ళి చేసుకోనన్నారట!'' నిరుపమ అంతకన్నా గంభీరంగా అంది.

''ఆ విషయం మొన్నే చెప్పాను. ఇప్పుడు కొత్తగా మాట్లాడేదేముంది?''

''అదే ... ఎందుకు చేసుకోనన్నారని తెలుసుకొందామని...!''

''ఆ విషయం కూడా ముందే చెప్పాను'' నా కంఠం నాకు తెలియకుండానే కఠినంగా పలికింది. అంతే నిరుపమ నా కాళ్ల దగ్గర చతికిలపడి భోరున ఏడవడం మొదలెట్టింది. అనుకోకుండా తలెత్తిన పరిణామానికి నిర్ఘాంతపోయాను. ఏం చేయాలో నాకు తోచలేదు. ఈ స్థితిలో చూసిన వాళ్ళెవరయినా తనేదో చేసానని అనుకోరూ? నిరుపమ అలా ఏడుస్తోనే ఏవేవో ఏకరువు పెట్టింది. సారాంశం మాత్రం ఒక్కటే!

నిరుపమకు అలాంటి మనిషి కానీ అలాంటి విషయం కానీ ఏమీ తెలియదట! నంగనాచి!

కానీ, ఆ క్షణంలో మాత్రం ఆమె చెప్పేవన్నీ నిజాలుగానే అనిపించాయి.

ఇంతలో నిరుపమ గబుక్కున పైకి లేచి, జాకెట్టులోంచి ఓ చిన్న ఫోటో తీసి నా చేతిలో పెట్టింది. నేను దానివంక అయోమయంగా చూసాను. ఆ ఫోటో నాదేనట! మా యింట్లో ఎప్పుడూ, చూసిన జ్ఞాపకం లేదు. చాలా చిన్నప్పటిది. రెండేళ్ళుంటాయేమో! వంటి మీద నిక్కరు కూడా లేదు. తనకు ఇబ్బందిగా అనిపించింది.

నిరుపమ గడగడ చెప్పుకుపోతోంది - ఆమె చిన్నప్పటి నుంచీ నన్నే ప్రేమిస్తోందట. అందుకు సాక్ష్యమే భద్రంగా దాచుకున్న ఈ ఫోటోనట. నాకు సంబంధించిన వస్తువులెన్నో ఆమె దగ్గర భద్రంగా వున్నాయట. నన్ను తప్ప మరో వ్యక్తిని ఆమె ఊహల్లో కూడా ఊహించలేదట. అలా చెపుతూనే ఓ పాళీవిరిగిన కలాన్ని, ఓ పాత బెల్టుని, మేజోళ్ళ జతనీ - ఇంకా ఇలాంటివే కొన్ని వస్తువులను తెచ్చి చూపించింది. నా ఎదురుగానే వాటిని గుండెలకి హత్తుకుంది. పెదవులకి ఆనించుకుంది. నాలో ఏదో అలజడి చెలరేగింది. ఓ అమాయకురాలి ప్రేమను ఇన్నాళ్ళూ గుర్తించనైనా గుర్తించలేదా అని! ఆ ఆలోచనలలో పడి నేను నిరుపమ క్షణంలో శోకాలు పెట్టడం మరుక్షణంలో మామూలుగా ప్రవర్తించడాన్ని గుర్తించనే లేదు.

ఆ గదిలో మాట్లాడుతోంది ఒక్కరే. అదేంటో గానీ ఏవేవో మాట్లాడాలనుకొన్న నేను కుండ బద్దలు కొట్టడం అటుంచి పన్నెత్తి పలకరించలేక పోయాను.

చివరికి నిరుపమ దిగ్గున లేచి చరచరా వెళ్ళి ఓ కర్పూరం ముద్ద చేతిలో పెట్టుకొచ్చింది. అప్పటికే ఏడుపుతో చెదిరిన జుట్టుతో బొట్టుతో మొహమంతా ఏదోలా వుంది. కర్పూరం వున్న చేతిని నా ముందుకు చాచి నా పట్ల ఆమె ప్రేమ గాఢమైనదని నిరూపించడానికి కావాలంటే అరచేతిలో కర్పూరం వెలిగించి చూపుతానంది.

నేనిక చలించి పోయాను. అప్రయత్నంగా ఆమె చేయి పట్టుకొన్నాను. ఆమెని వద్దని వారించబోయాను. షర్టు పై జేబులో గరగరలాడుతోన్న టెలిగ్రాం కాగితం నన్ను వాస్తవంలోకి పడేసింది.

అంతే! ఆమె చేతిని వదిలి గబగబ బయటకు వెళ్ళిపోయాను.

అప్పుడే ఒక్క క్షణం ఆగి వెనక్కి తిరిగి నిరుపమ మొహంలో కదలాడుతున్న విజయ దరహాసాన్ని చూసి వుంటే నా నిర్ణయం మరోలా ఉండేదేమో!

నిరుపమ

ఇవ్వాళ భాను వస్తాడట. అతనికి చాలా కీలకమైన సాక్ష్యాలు దొరికాయట. నన్ను పెళ్ళి చేసుకోనని చెప్పడానికే వస్తున్నాడట.

అమ్మ ఉదయాన్నే వచ్చి చెప్పింది. " ఏదో అయిన వాళ్ళ అబ్బాయి చెప్పినట్లు వింటాడు అనుకుంటే ఇలా అడ్డం తిరిగాడే! అయినా సొంతం బావే వద్దన్నాక ఇక బయట సంబంధాలు వస్తాయా? ఇన్నాళ్ళు ఎలాగో గుట్టు మట్టుగా వున్నాం. ఇప్పుడు ఒక్కసారిగా గుప్పుమంది. మనకుంది రెండే రెండు అవకాశాలు. మొదటిది భాను. రెండోది అష్ఫాక్! లేకపోతే మనం తంటాల్లో పడాల్సి వుంటుంది!!"

అష్ఫాక్! అతన్ని భర్తగా భరించలేను. అతనికి భానుకి పోలికే లేదు. భాను భవిష్యత్తు అతనికెక్కడిది? తను ఎలాగైనా భాను చేజారిపోకుండా చూడాలి! అలా చేయలేకపోతే ఇన్నాళ్ళూ తన మీద తనకున్న విశ్వాసమంతా వట్టిదే! తను అనుకున్నది సాధించాలి! సాధించి తీరాలి!

భాను మామయ్యతో కలిసి వచ్చాడు. నేను మామయ్యను పలకరించి వచ్చాను. విచారంగా వున్న నా మొహం చూసి ఆయన తలదించుకున్నాడు.

నేను, భాను ఓ గదిలో సమావేశమయ్యాం. భాను ఏం మాట్లాడకుండా తలదించుకొని కూర్చుని వున్నాడు. కందగడ్డలా వున్న ఆ మొహం చూస్తే నవ్వొచ్చింది.

మాటలు పేర్చుకుంటున్నాడేమో!

భానుకి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నేనే మాట్లాడాను. భోరున ఏడ్చాను. అప్పుడెప్పుడే నాన్నమ్మ పాత ట్రంకుపెట్టెలోని సామాను అమ్మ పాతసామాన్ల వాడికి వేస్తుంటే తీసివుంచిన ఓ ఫోటోని అతనికి చూపించాను.

నాన్నమ్మ అమ్మకు తెలియకుండా రహస్యంగా దాచుకున్నదది! వంటి మీద బట్టల్లేకుండా ముక్కుపురుగులా అసహ్యంగా వున్నాడు. నాన్నమ్మకి ఎలా నచ్చిందో ఆ ఫోటో! పిచ్చి నాన్నమ్మ! చచ్చి ఎక్కడుందో కానీ సమయానికి ఉపయోగపడింది.!

భాను ఆ ఫోటో చూసి నిర్ఘాంతపోయాడు. అలాగే తమ్ముడివి ఏవో

పాత వస్తువులు అతనివిగా చూపించాను. అతని మొహంలో భావాలు నాకు స్పష్టంగా తెలుస్తున్నాయి. మనిషి బాగా చలించి పోయాడు.

ఆ తరువాత అరచేతిలో కర్పూరం ముద్దపెట్టుకొని వెలిగించు బావా! అన్నాను. లోలోపల కాస్త భయంగానే వుంది. నిజంగానే వెలిగిస్తే చేయి కాలదూ?

భాను వారిస్తున్నట్లుగా టక్కున చేయి పట్టుకున్నాడు. భాను చేయి వణుకుతోంది. ఆ క్షణంలోనే నాకు తెలిసిపోయింది. విజేతని నేనేనని!

భాను ఏం మాట్లాడలేక బయటకు వెళ్ళిపోయాడు. చివరికి అష్ఫాక్ విషయం కూడా ప్రస్తావించకుండా!

ఇదే అష్ఫాక్ అయివుంటే కర్పూరం వెలిగించకుండా వుండేవాడేనా? అది కాల్చిన అరచేతిని ముద్దాడకుండా వుండేవాడేనా?

**భానుమూర్తి**

అక్కడే వుంటే నేనేమయి పోతానోనన్న భయంతో మావురికి పారిపోయి వచ్చినట్లు వచ్చిపడ్డాను. రాగానే శరత్ దగ్గరికి వెళ్లాను. అంతా విని శరత్ అన్నాడు, ''అ మెలోడ్రామా సరేగాని.... ఇంతకీ నీ అనుమానం తీరిందా లేదా?''

అప్పుడు తన బుర్ర తిరిగి వచ్చింది. అప్పటికే నాన్న గదిలో ఏం జరిగిందో ఆరాతీసి, నిరుపమ నిర్దోషిత్వాన్ని నిరూపించిచుకొంది కనుక ఇక అభ్యంతరమే ముందని గొడవ పెడుతున్నాడు.

నేను శరత్‌ని బతిమిలాడాను, '' ఒరేయ్ బాబు ... మా నాన్న నస, భరించలేకున్నాను. నువ్వు వచ్చి కాస్త మాట్లాడరా'' అని.

శరత్ నా తరఫున వకాల్తా పుచ్చుకొని నాన్నతో మాట్లాడాడు.

''వాడికి ఇష్టం లేనపుడు అంత బలవంతం దేనికి? పెళ్ళంటే ఒక్కరోజు హంగామా కాదుగా? ఇద్దరూ జీవితాంతం ఇద్దరి జీవితాలు కలిసి జీవించాలి! ఇలాంటి అసంతృప్తి పునాది మీద దాంపత్య జీవితం పటిష్టంగా నిలబడుతుందా?''

ఆ అమ్మాయికి అన్యాయం జరుగుతుందన్నాడు నాన్న.

''మీరనుకుంటున్నట్లు ఏమీ జరగలేదు. నిజంగానే నిశ్చితార్థమో మరేదో జరిగివుంటే అలాగే ఆలోచించేవని. ఇంకా పెద్దల మధ్య మాటల్లోనే వుంది కానీ, రూపం ఎక్కడ దాల్చింది? కాబట్టి ఆ అమ్మాయికి జరిగే నష్టం ఏమీ లేదు!'' శరత్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు.

చివరికి నాన్న అది తమ స్వంత వ్యవహారం అన్నాడు. ప్రాణ స్నేహితుడైన తన కన్నా స్వంతమనిషి మరొకడు లేడనీ, నేను ఆ అమ్మాయిని చేసుకోవడం

జరగదనీ ఎందుకంటే నాకు వాస్తవాన్ని జీర్ణించుకుని ఆ అమ్మాయిని చేసుకొని తదుపరి పరిణామాలను భరించే శక్తి లేదని శరత్ స్పష్టంగా చెప్పాడు. ఇద్దరి మంచీ కోరేవారైతే వేరే సంబంధాలు చూడమన్నాడు. అమ్మ కూడా మా పక్షమే.

గేటుదాకా వెళ్ళాక శరత్ నాతో అన్నాడు - ''నువ్వా అమ్మాయితో జీవితాంతం కలిసి వుండాలి. కాబట్టి నీ పెళ్ళి నిర్ణయం మీ నాన్నకు వదిలేయకుండా నువ్వు ఆలోచించి తీసుకో! రేపు నీకు సమస్యలొచ్చినపుడు మీ నాన్న వుండడు - నేనూ వుండను. ఇప్పటికీ మించి పోయిందేం లేదు. నిదానంగా ఆలోచించి - ఆ అమ్మాయినే చేసుకోవాలంటే చేసుకో!''

''ఆ రోజు రాత్రి ఇంట్లో పెద్ద గొడవ జరిగింది. నాన్న పిచ్చెక్కినట్లుగా అరిచాడు. మూడు లక్షలు తెచ్చి ఆయన మొహాన కొట్టు! మనం సంబంధం తెంపుకుందాం!'' అలా అరుస్తునే గుండె పట్టుకుని సోఫాలో పక్కకి ఒరిగాడు.

అమ్మ గబగబ ఆయన చొక్కా గుండీలు విప్పి గుండె సవరించింది. నేను స్టెత్ తీసుకొని పరీక్ష చేయబోయాను. ఆయన ఇంకాస్త అరవడం మొదలెట్టాడు.

''నీ కొడుకు నిరుపమ ఉసురు పోసుకుంటున్నాడు! ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానంటేనే నన్ను ముట్టుకోమను! లేకపోతే నన్నిట్లాగే చావనియ్యమను!''

అమ్మ నన్ను వంటింట్లోకి లాక్కెళ్ళి బతిమిలాడింది. ఆ విషయం మళ్ళీ మాట్లాడదాం. ఇప్పుడు ఆయన్ని కుదుట పడనీ అని. మళ్ళీ నాన్న దగ్గరికి వెళ్ళి అంతా ఆయన ఇష్టమని చెప్పింది.

ఆయన ముందే ఫోన్ చేసి జగన్నాథం మామయ్యకు ఈ మాటే చెప్పమన్నాడు.

ఆయన చెప్పినట్లుగా చేసి ఆయన్ని వెంటనే ఫిజీషియన్ దగ్గరికి తీసుకెళ్ళాను. నాన్నకి హార్టెటాక్ రాలేదు. బి.పి. పెరిగింది అంతే!

నా పెళ్ళి మాత్రం కుదిరిపోయింది. వద్దూ వద్దూ అనుకొన్న నిరుపమతోనే! నేను అమ్మా నాన్నలతో మాత్రం ఖచ్చితంగా చెప్పేసాను. మీరు చెప్పినట్టే చేస్తాను. కానీ రేపు ఆ అమ్మాయితో ఏ సమస్య వచ్చినా నేను తల దూర్చను. మీరు మీరే చూసుకోండి అని.

నా కిప్పటికీ ఆశ్చర్యం కలిగించే అంశమొకటి వుంది.

నేను డాక్టరుని! అయినా గుండె నొప్పి మాములు నొప్పో వెంటనే గ్రహించలేకపోయాను. పైనుంచి నిరుపమను తిరస్కరించడానికి వేయిన్నొక్క

కారణాలు వెతికానే కానీ మా వైద్యశాస్త్రం ఘోషిస్తున్నట్లుగా - మేనరికం వద్దు! అని తెగేసి చెప్పలేక పోయాను.

ఓ చేతకాని వాడిలా ఓడిపోయాను. నా పిరికితనానికి నా జీవితాన్నే పణంగా పెడుతున్నాను.

ఏది ఏమైనా.....అసంతృప్తితో, అనుమానంతో మా వైవాహిక జీవితం మొదలవబోతోంది! ఇది ఎలాంటి పరిణామాలకి దారితీస్తుందో!

**నిరుపమ**

చివరికి నా పెళ్ళి నిశ్చయమయింది. ఇది నా విజయం!

పెద్దలెవరూ భానుని ఒప్పించలేకపోయినపుడు తను స్వయంగా భానుని గెలుచుకుంది. కానీ భానులో అంతటి అనుమానం చెలరేగడానికి కారణం అష్ఫాక్ అయివుంటాడా? ఎంతైనా అష్ఫాక్ తనకై తను చెప్పుకోడు కదా?

మామయ్య ఆ తరువాత చెప్పాడు ఎవరో శరత్ అట. అతని వల్లే భానుకి అష్ఫాక్ సంగతి తెలిసిందట. ఆ శరతే స్వయంగా భాను ఈ పెళ్ళి ససేమీరా చేసుకోడని మామయ్యతో వాదించాడట.

ఇది భాను బుర్రకు పుట్టిన బుద్ధి కాదు శరత్ రేకెత్తించిందని మామయ్య వాపోయాడు. ఎంతైనా మామయ్య ఘటికుడు. పెళ్ళి కుదిర్చి కానీ నిద్ర పోలేదు!

నిజానికి, ఈ ఘనత అంతా అమ్మది! పావులు కదిలించడంలో ఆమెకు ఆమే సాటి. తండ్రే కొడుక్కి గడ్డిపెట్టి, మెడలు వంచేలా చేసింది.

అయినా.... ఆ శరత్‌కు భాను మీద అంత ఆప్యాయత దేనికి? పెళ్ళి విషయంలో కూడా ఆయనగారి నిర్ణయమే భాను నిర్ణయం కావాలా? నిజానికి నన్ను అనుమానించిందీ, అవమానించిదీ భాను కాదు. శరత్! భాను ఒక మాధ్యమం మాత్రమే!

నాకు జరిగిన పరాభవానికి శరత్‌ని తేలికగా విడిచిపెడతానా? ఆయన భార్యని తేలికగా విడిచి పెడతానా? చూస్తాను ... ఎంత కాలం భానుతో స్నేహం చేస్తాడో! ఎంతకాలం ఆయనగారి నిర్ణయాలు మా మీద రుద్దుతారో!

అయినా ముందు భానుని కొంచెం సాగదీయాలి. మొదట్లోనే కాస్త మెళుకువగా వ్యవహరించకపోతే అక్కను బావ ఆడించినట్లు తోలుబొమ్మను చేసి ఆడిస్తాడు.

కానీ, అందరినీ మించి అత్తయ్య ప్రవర్తన వల్ల వళ్ళు మండుతోంది. నేనెట్లా పోయినా ఫరవాలేదు. ఆవిడ గారి భానుయే ముఖ్యంట! మా అమ్మ ముందు చూపుతో ఆవిడ్ని దూరాన వుంచకపోతే నాన్నని అడ్డుపెట్టుకొని

మా నెత్తిన గుద్దేసేదే! అసాధ్యురాలు! సొంత మేనకోడలినన్న అభిమానం లేశమాత్రమైనా చూపుతోందా? ఈరోజు ఆవిడ గారిదేమో. రేపు మాత్రం ఖచ్చితంగా నాదే! ఏదో ఓనాడు నన్నిలా ఆడిపోసుకున్నందుకు ఆవిడగారు పశ్చాత్తాప పడకపోదు.

ఏమైనా నా వైవాహిక జీవితం అభాండంతో, అవమానంతో మొదలవుతోంది! జరగబోయే పరిణామాలకు నేను బాధ్యురాలిని కాను! ఎలా అవుతాను?

**భానుమూర్తి**

పెళ్ళిరోజు దగ్గర పడుతోంది.

ఎన్నెన్ని కలలు కన్నాను! ఎంత హంగామా చేద్దామనుకొన్నాను! ఇప్పుడేదో నిర్లిప్తత! నీరవత!

ఎవ్వరికీ కార్డులు ఇవ్వాలని కానీ, పెళ్ళికి పిలవాలని కానీ అనిపించడంలేదు. మిత్రబృందం అందరికీ జరిగిన విషయం తెలుసు. బంధువుల్లోనూ తెలిసిపోయే వుంటుంది. అందరూ నన్ను చూసి జాలిగా, వెటకారంగా నవ్వుతున్నట్లుగా అనిపిస్తోంది.

ఒక్క శరత్ మాత్రమే నన్ను అర్థం చేసుకోగలడు. శరత్ నొక్కడినే పెళ్ళికి పిలిచాను. పెళ్ళికి బయల్దేరే క్షణం దాకా క్లినిక్‌లోనే గడిపాను. అమ్మ నా నిరాసక్తతను చూసి చాలా బాధపడుతోంది. కళ్ళ నీళ్ళు పెట్టుకుంటోంది. నాన్న మాత్రం మహానందంగా వున్నాడు. బహుశా తన పంతం నెరవేరిందన్న సంతోషం కాబోలు!

అమ్మ మొక్కుబడిగా పెళ్ళిపనులు చేసుకుంటోంది. పెళ్ళికి బయలుదేరేముందు శరత్ వచ్చి సీరియస్ కేసులేవో అడ్మిట్ అయ్యాయి - పెళ్ళికి రాలేకపోతున్నానన్నాడు. కారణమేదైనా శరత్‌కు రావడానికి మనసు వప్పివుండదు. జరిగిన దానికంతా తనే కారణమని మథనపడుతున్నాడట. ఇంత కదిలించాక ఆ అమ్మాయినే చేసుకోవాల్సి వస్తుందని తను అనుకోలేదని మరో స్నేహితుడి దగ్గర వాపోయాడట.

తప్పకుండా నిరుపమనే చేసుకోవాల్సి వస్తుందని ఎవరు ఊహించారు? అయినా తన విషయం బాగా తెలిసిన వాడు కాబట్టే ముందుగా హెచ్చరించాడు. ఇదే పెళ్ళయిన తర్వాత ఏ అప్పాక్ ద్వారానో తెలిసుంటే తను గుండె పగిలి చచ్చేవాడు కాదూ?

శరత్ అనునయంగా చెప్పాడు - ''జరిగిందేదో జరిగిపోయింది. ఏం

నిర్ణయం తీసుకొన్నా ముందే తీసుకోవాల్సింది. ఇకపై ఆ అమ్మాయి నీ భార్య. కష్టంలోనూ సుఖంలోనూ జీవితాంతం నీతో కలిసి వుండాల్సిన వ్యక్తి. ఆ అనుమానం ఓ నీలాపనింద అనుకొని మనసులోంచి తుడిచేసి - తలంబ్రాలు పోసెయి. మనస్ఫూర్తిగా ఆమెని ఆహ్వానించు, మొండితనం చేయకు...."

ఇలాగే ఏవేవో చెప్పాడు. తనకు అన్నయ్య లేని లోటు తీరినట్లనిపించింది. ఎలాంటి ఆర్భాటం - సింగారం లేకుండా పెళ్ళి పీటలెక్కాను. ముభావంగానే పెళ్ళి అయిందనిపించాను.

శరత్ పెళ్ళిలో గానీ.... మరో స్నేహితుడి పెళ్ళిలోగానీ... ఎంత సరదా చేసాం. ఆ ఆనందం... ఆ సంబరం .... ఇప్పుడేవి? అంతటా గంభీరత! ఏదో పోగొట్టుకున్నట్లు పైపైని వ్యవహారం! తన ఆలోచనల్లో తనుండగానే బిందెలో వేసిన ఉంగరాన్ని నిరుపమ మూడుసార్లు తనే తీసిందట! ఆమె తరుపువాళ్ళు కేరింతలు కొడుతున్నారు. వేళాకోళం ఆడుతున్నారు. 'నిరుపమ అంటే ఏమనుకొన్నారు?' పెళ్ళి పీటల మీదనుంచే కనుబొమలు ఎగరేసి అంటోంది నిరుపమ.

నేను ఉలిక్కిపడ్డాను. ఏదో తెలీనిభయం నన్నావహించి ఒక్కక్షణం ఊపిరాడనీయ లేదు. మళ్ళీ సర్దుక్కూర్చున్నాను. నిరుపమ కన్నా అన్ని విధాల అధికుడనే అయినా ఓ నిజాన్ని నిజమని నిరూపించలేక దోషినై ఆమెకు తల ఒగ్గి కూర్చున్నాను. పెళ్ళి కొచ్చిన వాళ్ళందరూ నన్ను హేళన చేస్తున్నట్లనిపించింది. ఎట్లాగో పెళ్ళి జరిగిపోయింది.

శరత్ మాటలు గుర్తు తెచ్చుకుంటూ నిరుపమతో ప్రథమ సమాగమానికి సిద్ధపడ్డాను. కాదు....కాదు... పెళ్ళికి రాజీపడినట్లే దీనికీ రాజీపడ్డాను.

అసలు ఈ రాజీ అన్న మాటే ఓ పెద్ద అబద్దపు మాట. ఓ బూటకపు మాట. కావలసినది సాధించలేని తనలాంటి పిరికివాడికి వర్తించే మాట.

ఒకటి మాత్రం నిజం. మానవుడి అవసరాలన్నీ శారీరకమైనంతగా మానసికమైనవి. మానసికంగా నాలో చెలరేగిన అసంతృప్తి - అది మిగిల్చిన శూన్యతను భౌతిక సమాగమం ఏ మాత్రం తొలగించ లేకపోయింది. అశాంతి చెలరేగింది.

సంపూర్ణ సమాగమం అనుభూతులను పంచుకోకుండానే - అనుభవాలను కలబోసు కోకుండానే సంభవిస్తుందా?

పెళ్ళయిన కొత్తల్లో శరత్ ఎంత ఉత్సాహంగా ఉండేవాడు. అతని కళ్ళు

ఎంత కాంతిగా కళకళ లాడుతూ వుండేవి! తామందరూ వేళాకోళాలాడుతూ ఆటలు పట్టిస్తుంటే శరత్ మొహంలో దోబూచులాడిన చిరునవ్వు ఇప్పటికి జ్ఞాపకం వుంది. తనకి ఇప్పుడు అర్థమవుతోంది శరత్ మాలతి ముఖాలలో కనిపించే ప్రశాంతత వారి మనసులలో వున్న తృప్తి వలన వచ్చింది.

తను - నిరుపమ ఎప్పటికైనా ఆ స్థితిసాధించగలరా? ఏమో....?

ఆ అష్టావక్ర పగబూనాడో లేక తను చూసి - లేనిపోని లోపాలు తగిలించి - తిరస్కరించిన ఆ అమ్మాయిలందరూ శపించారోగానీ తన జీవితమే అంధకారంలో పడిపోయింది.

అసంతృప్తి! అసంతృప్తి!!

ఇది తనను ఏ అగాధంలో ముంచుతుందో!

**నిరుపమ**

పెళ్ళి అయిపోయింది! సంసార జీవితమూ మొదలయింది!

అందుకే కాబోలు అంటూ వుంటారు - మగవాడి బలమూ బలహీనతా ఆడదేనని!

పెళ్ళే వద్దని భీష్మించుకు కూర్చున్న భాను బుద్ధిగా అన్ని వ్యవహారాలు కానిచ్చాడు. పెళ్ళి అన్నిరోగాలకు తిరుగులేని ఔషధమట!

అందరి విషయంలో ఏమో కానీ భాను మాత్రం టక్కున దారికొచ్చాడు. అమ్మ చెప్పినట్లు ఇక జాగ్రత్తగా నాకు అనువుగా మలుచుకోవాలి.

అత్తవారింటికి కాపురానికి బయలుదేరాను. లోలోపల కాస్త బెరుకుగా వుంది. ఇక్కడంటే తనకు స్థానబలముంది. అక్కడ భానుకి! భాను అక్కడెలా ప్రవర్తిస్తాడో ఏమో? అత్తయ్య కూడా తనంటే అయిష్టంగా వుంది. అమ్మ అక్కడికి రావడానికి ఇష్టపడలేదు. అక్క వచ్చి వదిలి వెళ్ళింది.

మామయ్య ఎంతో అపురూపంగా చూసుకుంటున్నాడు. ఆప్యాయంగా పలకరిస్తున్నాడు నన్ను భాను, అత్తయ్య దూరంగా వుంచుతున్నారో లేక నాలో వున్న అపరాధభావనే నన్ను వారికి దూరంగా వుంచుతుందో తెలియడం లేదు. చివరికో రోజు నేను కుతూహలంగా ఎదురు చూస్తున్న వ్యక్తులు రానే వచ్చారు.

శరత్ - మాలతి.

వాళ్ళను చూడగానే ఒక్క-క్షణం గుండె భగ్గుమంది.

ఇద్దరూ ఒద్దికగా, చూడ ముచ్చటగా వున్నారు: వారి మొహాల్లోని తేజస్సు నన్ను మరింత పిచ్చిదానిని చేసింది.

అత్తయ్య, మామయ్య వారితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. భాను సంగతి చెప్పక్కరలేదు. వాళ్ళను చూసీ చూడగానే భాను మొహం ఒక్కసారిగా వెలిగిపోయింది. భాను అంత ఉత్తేజితుడై వుండగా నేను ఎప్పుడూ చూడనే లేదు. చాలా ఉల్లాసంగా కబుర్లు చెబుతున్నాడు. మరోలా చెప్పాలంటే అడ్డూ అదుపు లేకుండా వసపిట్టలా వాగుతూనే వున్నాడు - వాళ్ళు వచ్చిందగ్గర్నించీ వెళ్ళేదాకా!

మాలతి పళ్ళన్నీ బయటికి పెట్టి నవ్వుతూ నన్ను పలకరించింది. అదేంటో కానీ ఆవిడ ఏం మాట్లాడుతున్నా నన్ను ఎద్దేవా చేసి మాట్లాడుతున్నట్లే అనిపిస్తోంది. ఎందుకని మాలతి అలా నవ్వుతూనే వుంటుంది? బుగ్గలు నొప్పి పుట్టవూ?

శరత్, భాను ఏవో కేసుల గురించి మాట్లాడు కొంటున్నారు. నాకు చిరాకు పుట్టింది. మాలతి మాత్రం వాళ్ళ సంభాషణలో తనూ తలదూరుస్తోంది. ఆ రోగాలరొష్టుల్లో మాట్లాడాల్సిన విషయాలేం వుంటాయసలు? అందులోను అంత ఉత్సాహంగా....!

మాలతి మధ్యలో లేచి వంటింట్లోకి వెళ్ళింది. అత్తయ్యకు వంటకాలను టేబుల్ మీద సర్దడంలో సహాయం చేసింది. మాలతి వాలకం చూసి నాకు వళ్ళంతా కారం రాసినట్లయింది. నేను ఇక్కడికి వచ్చి పదిహేను రోజులైనా వంటగది గడప దాటి లోపలికి అడుగుపెట్ట లేదు. నాకది అవసరం కూడా అనిపించలేదు. ఆ అవసరం రానివ్వను కూడా!

కానీ, మాలతి చొరవగా ఇల్లంతా తిరుగుతోంటే మాత్రం కంపరంగా వుంది. ఏమైనా భాను పట్ల నేనో అభిప్రాయానికి రావడానికి వీరే సరియైన వివరాలు ఇవ్వగలరనిపించింది. మెల్లిగా మాటల మధ్యలో మాలతిని భానుకు ఏమైనా దురలవాట్లు వున్నాయా ఎవరైనా ఆడస్నేహితులున్నారా అని ఆరా తీసాను. మాలతి పళ్ళికిలించడం ఆపి, నా మొహంలోకి విచిత్రంగా చూసింది. ఇంతలో శరత్, భాను తమ దగ్గరికి రావడంతో సమాధానం ఇవ్వకుండానే సరిపుచ్చింది. మాలతి బయల్దేరబోతుంటే, తనతో మాలతికి తాంబూలం ఇప్పించింది.

''ఏం మాలతీ విశేషమేమీ లేదూ?'' అత్తయ్య నవ్వుతూ అడిగింది.

మాలతి నునుసిగ్గుతో తలాడించింది.

ఆ క్షణంలోనే తనలో ఆలోచన తళుక్కుమంది. భానుని అదుపులోకి తెచ్చే సూత్రమేదో చేతికి చిక్కినట్లు నిపించింది.

మాలతి వాళ్ళు వెళ్ళీ వెళ్ళగానే - భాను నన్ను రోజూ మరవకుండా వేసుకోమని ఇచ్చిన టాబ్లెట్లను తీసి చెత్తబుట్టలోకి విసిరేసాను.

నాలో కొత్త ఉత్సాహం ఉరకలు వేసింది.

అంతకు ముందు మాలతి వాళ్ళ మీద కలిగిన కోపమంతా ఎగిరిపోయింది.

చూస్తాను! ఈ విధంగా చేయడం వల్లనైనా భాను నా మీద ప్రేమ కురిపించకపోతాడా?

**భానుమూర్తి**

శరత్ - మాలతి వచ్చి వెళ్ళారు.

వాళ్ళిద్దరిలో ఏం మహత్యం వుందో ఏమో కానీ వారిలాగే వారి పరిసరాలు ఉల్లాసభరితం అయిపోతాయి.

నిరుపమ వాళ్ళిద్దర్నీ చూడగానే మొహం చిట్లించింది. వాళ్ళు వెళ్ళేదాకా అలానే వుంది. బహుశా అన్ని అనర్థాలకీ వాళ్ళే మూలమనుకుంటుందేమో?

శరత్ - మాలతి చాలా సంస్కార వంతులు. వారి ప్రవర్తన కూడా అలాగే వుంటుంది. నిరుపమని ఓ పాతస్నేహితురాలిని పలకరించినంత ఆప్యాయంగానే పలకరించారు. హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

నిరుపమ మాత్రం వాళ్ళు వెళ్ళేదాకా చిటపటలాడుతూనే వుంది. వాళ్ళని సాగనంపి ఇంట్లోకి రాగానే - అమ్మ మీద విరుచుకు పడింది. మాలతి చొరవగా వంట యింట్లోకి వెళ్ళి ఏదో చేసిందట. అదీ కారణం!

అమ్మ గుడ్లనీరు కుక్కుకొని లోపలికి పోయింది.

నేను ముందే చెప్పానుగా నిరుపమ ఎలా ప్రవర్తించినా నేను పట్టించుకోబోనని! అత్తాకోడళ్ళ మధ్య మూగయుద్ధం ఇన్నాళ్ళకు గొంతు విప్పుకుంది. ఏమైనా ఇది ప్రతిఘటన లేని ఒకవైపు దాడే!

నాకు చాలా అసహ్యమేసింది. అమ్మ ఎంత మంచిది! మాలతి ఎంత మంచిది! ఇద్దర్నీ కలిపి నిరుపమ అలా చెరిగేస్తుంటే నేనసలు నోరుమెదపకుండా ఎలా వున్నాను?

ఘర్షణ పడకూడదన్నదే నా తత్వం.

ఆ మర్నాడు తెలిసింది. నిరుపమ నా గురించి ఏవేవో ఆరా తీసిందట!

మాలతి తప్పకుండా నిర్ఘాంతపోయుంటుంది. మొదటిసారి పలకరించడానికి వచ్చిన వాళ్ళని ఇలాంటి విషయాలా అడిగేది! అంతా ప్రారబ్ధం!

నేను ఒక్కసారిగా పలాయనవాదినై పోయాను.

నిద్ర మెలుకువ వచ్చినప్పటి నుంచీ నిద్రముంచుకు వచ్చేంత వరకూ ఇంటి బయటే వుంటున్నాను.

అష్ఫాక్ జ్ఞాపకాలు నన్నింకా వదలలేదు. నిరుపమతో ఒంటరిగా గడపాల్సినపుడల్లా అష్ఫాక్ మా మధ్య అదృశ్యరూపంలో ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఆ భావనని ఎలా పోగొట్టుకోవడం?

అందుకే నా పలాయన జీవితం!

అష్ఫాక్ నుంచీ...నిరుపమ నుంచీ...చివరికి నా నుంచి నేనే పలాయనం చేస్తున్నాను. దూరంగా...దూరంగా...పారిపోతున్నాను. కానీ అది ఫలితం లేని ప్రయత్నం మాత్రమే!

అమ్మ మాత్రం నన్ను సంతోషంగా వుండమనీ - నిర్లిప్తతను వదిలివేయమనీ ప్రాధేయపడుతోంది.

ఒకరోజు ఆమె మాటలు చెవిన బడ్డ నిరుపమ అమ్మని సాధించి వదిలింది - నేనేమైనా మీ కొడుకుని కాల్చుకు తింటున్నానా అని!

ఇప్పుడు అమ్మ నాతో ఎప్పుడో కానీ మాట్లాడదు. నాకూ అదే మంచిదనిపించింది. పాపం ఆవిడకూ పనెక్కువయింది. పనిలో సాయపడమని నిరుపమకి ఎవరు చెప్పాలి?

శరత్‌ని కలవడానికి వెళ్ళాను. మాటలమధ్యలో తను తండ్రి కాబోతున్నానన్నాడు. ఎంత అదృష్టవంతుడు! సంతోషమైన కుటుంబం - సంతోషమైన జీవితం!

వారి సంతోషంలో పాలు పంచుకోవడానికి బయటకు వెళదామని ఆహ్వానించాడు. కుటుంబసమేతంగా.

నిరుపమ ఏ మూడ్‌లో వుందో కానీ వెంటనే తయారయింది. నిరుపమ భారీగానే తయారయింది - దాదాపు ఓ పెళ్ళికి వెళ్తున్నట్లుగా!

మొహాన కళకళలాడే చిరునవ్వులేని అలంకరణ అందం ఇస్తుందా? నిరుపమ అందం కోసం అలంకరించుకోదు. ఆడంబరం కోసం, ఆర్భాటం కోసం అలంకరించుకుంటుంది. ఈ రోజూ అలాగే అలంకరించుకుంది.

నలుగురం నేరుగా హోటల్‌కి వెళ్ళి భోజనం చేసాం. భోజనాల సమయంలో శరత్ మాలతి నిరుపమని కూడా సంభాషణల్లోకి తీసుకురావాలని చాలా ప్రయత్నం చేసారు. నిరుపమ ఏడుపుగొట్టు మొహం పెట్టుకొని - కదలకుండా కూర్చుంది.

వచ్చిన అతిథి అలా వుంటే మిగిలిన వారికి ఎలా వుంటుంది? మానర్‌లేస్ బిహేవియర్!

అక్కడ నుంచి సినిమాకి వెళ్ళాం. అక్కడా అదే తంతు.

మాలతి నిరుపమ వాలకం చూసి వెనకాడుతోన్నా - నేను చొరవచేసి వారితో సంభాషణ కొనసాగించాను.

సినిమా అయ్యాక హాలులోంచి అందరు బయటకు వెళ్ళే దాకా ఆగి - అందరి కన్నా చివరిగా బయటకు వచ్చాం. నేనూ శరత్ కాస్త ముందుగా నడుస్తున్నాం. మా వెనకే మాలతి, నిరుపమ.

కారిడార్‌లోకి రాగానే నామీదికి ఎవరో వాలుతోన్నట్లుగా అనిపించింది. మాలతికి కళ్ళు తిరిగాయేమో అనుకొని వెనక్కి తిరిగాను. నిరుపమ!

మాలతి నిరుపమ దగ్గరకి రాబోయి - నిరుపమ పూర్తిగా నామీదికి ఒరిగి వుండడంతో కాస్త వెనక్కి తగ్గింది. నేను నిరుపమను అలాగే చేతుల మీదకు ఎత్తుకొని - అక్కడే వున్న కుర్చీలో కూర్చోబెట్టాను.

శరత్ నిరుపమ మొహంలోకి సూటిగా చూసాడు. ఏ కూల్‌డ్రింకో మంచినీళ్ళో తీసుకొస్తే బావుండున్నాడు. నిరుపమ నన్ను కదలనివ్వలేదు. గట్టిగా పట్టుకొని వుంది. నేను మెల్లిగా లేచి కూల్‌డ్రింక్ కోసం వెళ్ళేలోగా శరత్ తీసుకొని వచ్చేసాడు.

అప్పటికే నిరుపమ నిటారుగా లేచి నిల్చుంది. మాలతి ఆశ్చర్యంగా ఏదో అడుగుతోంటే విలాసంగా చేతులాడిస్తూ సమాధానిస్తోంది. చకచక మమ్మల్ని అనుసరించింది.

శరత్ మొహంలో కదలాడిన భావానికి నాకెలాగో అనిపించింది.

ఇలాంటి రోగం వైద్యశాస్త్రంలో లేదని డాక్టర్ అయిన శరత్ గ్రహించలేడా?

నిరుపమ ఎందుకిలా చేసింది? తమ సంబంధంలోని నీరవత వారికి తెలీదు? మరి ఈ నటనలెందుకు?

**నిరుపమ**

మాలతి వాళ్ళతో బయటకు వెళదాం అన్నాడు భాను.

పెళ్ళయ్యాక మొదటిసారి బయటకు వెళ్ళడం - అదీ ఒంటరిగా కాదు. ఓ క్షణం రానని చెప్పేద్దామనిపించింది. ఇంట్లో వుండి ఒరగబెట్టే ఘనకార్యమేమీ లేదు కనుక భానుతో బయలు దేరాను.

నాకు మాలతి గుర్తుకు వచ్చింది. ఇక్కడికి వచ్చినపుడు ఏదో కాటన్ చీర కట్టుకు వచ్చింది. నగలేమీ పెట్టుకోలేదు. నేను ఖరీదైన చీర కట్టుకొని - అమెరికన్ డైమండ్స్ సెట్ పెట్టుకున్నాను. ఈ రాత్రి లైట్లలో ధగధగలాడిపోవాలి. అన్నిటికీ మించి మాలతి చిన్నపోవాలి.

భోజనాల సమయంలో అందరూ వేళాకోళాలాడుతూ గలగల మాట్లాడుతున్నారు. మాటిమాటికి నా మాట ప్రస్తావిస్తున్నారు మాలతి - శరత్ - నాకు చాలా చిరాకేసింది.

పైనుంచి, శరత్ మాలతిని మురిపెంగా చూసుకోవడం గమనిస్తోంటే వొళ్ళు మండిపోతోంది. ఎంతయినా కోరి వరించిన భార్య కదా! వాళ్ళిద్దరికీ తందానా కొడుతూ భాను ఒకడు!

సినిమా చూస్తున్నా అన్యమనస్కంగానే వున్నాను. సినిమా పూర్తయ్యాక అందరూ బయటకు వెళ్ళాక మేం బయటకు వచ్చాం. కారిడార్‌లో నా ముందు భాను నడుస్తున్నాడు. నాకో ఆలోచన వచ్చింది. కళ్ళు మూసుకొని భాను మీదికి ఒరిగి పోయాను. భాను నన్ను చేతుల్లో ఎత్తుకొని, పొదివి పట్టుకొని, నెమ్మదిగా కుర్చీలో కూర్చోబెట్టాడు.

నేను దాదాపు భాను వళ్ళో కూర్చొని వున్నాను. నా తల అతని ఛాతీకి, చేతులు భుజాల మీద ఆన్చాను. నేను కోరుకుంది అదే!

ఆ శరత్-మాలతి మేమంత సఖ్యంగా వున్నామో ఎంత అన్యోన్యంగా వున్నామో తెలుసుకోవాలిగా! వాళ్ళొక్కళ్ళే సంతోషంగా వున్నారని వాళ్ళ తలబిరుసు!

నేను అనుకున్నది నెరవేరింది. భాను తనక్కడే కుర్చీలో కూర్చోబెట్టి కూల్ డ్రింక్ తేవడానికి వెళ్ళాడు.

నేను మాలతి వంక చూసి ధీమాగా తలెగరేసాను. మళ్ళీ మామూలుగా లేచి నిల్చున్నాను.

మళ్ళీ ఎప్పుడూ వారితో కలిసి బయటకు వెళ్ళలేదు. ఆ తరువాతో రోజు నెమ్మదిగా అసలు విషయం బయట పెట్టాను. నేను తల్లిని కాబోతున్నానని!

భానులో నేనాశించిన ఆశ్చర్యం కానీ ఆనందం కానీ కనిపించలేదు. నా వంక నిర్లిప్తంగా చూసి ఏదో గొణుక్కున్నాడు. అత్తయ్య కూడా ఓ శుష్క మందహాసం చేసి వూరుకొంది. మామయ్య మాత్రం చాలా సంబరపడి పోయాడు.

అమ్మ ఇక్కడికి రాదని నాకు ముందే తెలుసు కానీ - నాన్న కూడా రాలేదు బహుశా అమ్మే వద్దని వుంటుంది. నిజమే మరి! పెళ్ళి అయిపోయాక ఇక వీళ్ళ చుట్టూ తిరగాల్సిన అవసరం వాళ్ళకేం వుంది? అంతగా అయితే నేనే వెళతాను.

గర్భిణీ స్త్రీలకు విపరీతమైన కోరికలుంటాయట. అందరి సంగతి ఏమో కానీ - నేను మాత్రం కావాలనే మామయ్య దగ్గరకు వెళ్ళి పైనాపిల్ తినాలని వుందన్నాను. అదీ చెప్పేతీరులో చెప్పాను. ఎందుకంటే ఇప్పుడు అవి దొరకవని నాకూ తెలుసు. కానీ ముసలాయన ఘటికుడే! ఊరంతా కాళ్ళరిగేటట్లు తిరిగి - ఎట్లాగయితేనేం మూడోనాటికి ఓ కాయ పట్టుకొచ్చాడు. నేను వెంటనే మాలతికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పాను. మాలతి నేననుకొన్నట్లుగానే బోల్డంత ఆశ్చర్యపోయింది.

నా బులపాటమూ తీరింది. కాయని మామయ్యనే తినమన్నాను!

నేనూహించినంత హంగూ ఆర్భాటం లేకపోయినా ఇక్కడ సుఖంగానే వుంది. పుల్ల తీసి అవతల పెట్టాల్సిన పని లేదు. అత్తయ్యామామయ్యా నేను కోరినవన్నీ చేస్తారు. ఒక్కోసారి వారి విధేయతకు విసుగుపుడుతున్నా - అంతకు మించి గడుసు ఆలోచనలు పుడుతున్నాయి. నేను కోరే ఒక్కో వింత కోర్కెను ఏమీ వ్యాఖ్యానించకుండా కాదనకుండా తీర్చుతున్నారు. అత్తయ్యమామయ్యల గురించిన సమస్యే లేదు.

ఎటొచ్చి భాను ఇంకా అర్థం కావడం లేదు. నేను పాపాయితో తిరిగి వచ్చాక భాను సంగతి ఆలోచిస్తాను. అక్కడ్నించి వచ్చాక ఎలాగు నేనిక ఉపేక్షించను కదా! ఇక ఒకే ఒక కోరిక - భాను మీద పూర్తి పట్టు సాధించడం! కానీ ఎలా?

నిరుపమ ఓ రోజు నేను తండ్రిని కాబోతున్నానని చెప్పింది. అంటే నిరుపమ నేనిచ్చిన పిల్స్ వేసుకోవడం లేదన్నమాట!

నిరుపమ నా మాటలేం లెక్క చేయదా? ఇంత వరకూ తామిద్దరూ మనసులేం ఖర్మ పెదవులు విప్పి మాట్లాడుకోవడమే సాధ్యపడలేదు. అపార్థాల నుంచి బయట పడనే లేదు. అప్పుడే పిల్లలా? హమ్మో!

కానీ అది వాస్తవమే! రోజు రోజు గడుస్తున్న కొద్దీ మరింత స్పష్టంగా కళ్ళ ముందు నిలుస్తోన్న వాస్తవం!

అదేంటోగాని - ఆ రోజు శరత్‌లో మాలతిలో నేను గమనించిన సంబరం నాలో మచ్చుకైనా లేదు. నేను స్పందనలు కోల్పోయానా? ఎందుకీ నిర్లిప్తత నన్ను వదలడం లేదు?

నిరుపమ పుట్టింటికి వెళ్ళింది. ఇక్కడున్న కొద్ది కాలంలోనూ ఆవిడ గారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడానికి అమ్మానాన్న విలవిలలాడి పోయారు. నిరుపమకి కోరిన వాటిని సాధించేంత వరకూ మొండితనమే కానీ ఆ సాధించిన వాటిని అనుభవించడంలో ఆనందం వుండదు. నిర్లక్ష్యం చేస్తుంది. కోరేకోరికలన్నీ వింత కోరికలే!

అప్పుడు ఏవయితే అరుదో అవే కావాలి.

సీడ్‌లెస్ దానిమ్మలు ఉన్న పళాన కావాలని ఓ రోజు భోజనం మానేసి కూర్చుంది. గర్భిణీ అభోజనంగా వుంటే ఎలాగని అమ్మ తల్లడిల్లి పోయింది. నాన్న ఎలాగో వాటిని సంపాదించి, స్వయంగా వలిచి నిరుపమ చేతికిచ్చాడు. ఆమె ఆ దానిమ్మ గింజలున్న ప్లేటును తన గదిలోకి తీసుకెళ్ళి, కిటికీలోంచి పారబోసింది. అలాంటప్పుడు వాటికోసం ఎందుకంత రాద్ధాంతం చేసిందో అర్థం కాలేదు. ప్రతిపూటా ఏదో ఒకటి ఇలాంటి ఘనకార్యమే వెలగబెడుతుంది.

అమ్మానాన్న చాలా మధనపడుతున్నారు. నా దగ్గర నిరుపమ గురించి ప్రస్తావించే అవకాశం లేకుండా చేసుకున్నారు. నాకు వాళ్ళను చూస్తే జాలి వేస్తుంది.

అమ్మ ఎప్పుడూ నా గురించే దిగులు పడుతుంది.

నిరుపమను వారించే ఖండించే పని తను చేయలేదు. అమ్మతో ఆప్యాయంగా మాట్లాడి ఆమెకు స్వాంతన చేకూర్చనూ లేదు.

ఇలాంటి సందిగ్ధంలో నేను ఎంచుకున్నది ఘర్షణకు తావివ్వకుండా తెలివిగా తప్పించుకునే మార్గమే. నేను ప్రాక్టీసు మీదే దృష్టి కేంద్రీకరించాను.

నిరుపమ లేని మూడు నెలలూ ఎంతో సరదాగా గడిచిపోయాయి.

మాలతి కూడా పుట్టింటికి వెళ్ళడంతో పాత స్నేహితులమంతా శరత్ వాళ్ళింట్లో సమావేశమయ్యే వాళ్ళం. వాళ్ళందరితో నవ్వుతూ సంతోషంగా కాలం గడుపుతున్నా తనకు లోలోన చెప్పలేనంత దిగులుగా వుండేది.

నా ఆనందక్షణాలు భయంకరమైన చీకట్లోకి వేగంగా జారిపోతున్నాయి. నేను బతకాల్సింది - ఎలాంటి సున్నితమైన అనుభవాలకు అనుభూతులకు ఆస్కారం లేని మొండి బతుకు.

వీళ్ళందరిలో చిప్పిల్లుతోన్న సంతోషం చూస్తుంటే అసూయగా కూడా వుంది.

తనకే ఇలాంటి సమస్య రావాలా? తనే ఇలాంటి విషాదంలో చిక్కుకోవాలా? తనేం పాపం చేసాడని?

వీళ్ళందరితోనూ ఎంత గొప్ప సంబంధం చేసుకుంటానని కోతలు కోసేవాడు! ఇప్పుడు ఎలాంటి సంబంధం చేసుకొన్నాడు? పైనుంచి లోపాలన్నిటినీ స్వయంగా తనే చాటింపు వేసాడు. ఛ!

అందరూ మామూలుగానే ప్రవర్తిస్తున్నా నామట్టుకు నాకు వాళ్ళు నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరిస్తున్నట్లుగా వుంది. వాళ్ళందరి మధ్య నుంచి మాయమైపోవాలనిపిస్తుంది. దూరంగా పారిపోవాలనిపిస్తుంది. అవన్నీ తనలాంటి వాడు అనుకోవాల్సిన మాటలు కావు.

అయినా ఆ అష్వాక్ ఎంతో మేలు! కొంతలో కొంత నిరుపమకు చేరువ కాగలిగేడు. మరి తను?

ఇటు అమ్మానాన్నలకు దూరమయ్యాడు. అటు నిరుపమకు దగ్గర కాలేడు.

స్నేహితులకు సన్నిహితం కాలేడు.

ఏమైనా - ఎలాంటి సంతోష సంబరాలకు తావులేకుండా - రోజులు గడిచిపోతూనే వున్నాయి.

మాలతికి ఆడపిల్లని కబురు వచ్చింది. శరత్ ఉరుకులు పరుగులు మీద వెళ్ళాడు.

శరత్ తిరిగిరాక ముందే తనకీ కబురు వచ్చింది - ఆడపిల్లని! ప్రిమెచ్యూర్ డెలివరీ! నా మనసంతా అదోలా అయిపోయింది. కానీ జగన్నాథం మామయ్య వాళ్ళింటికి వెళ్ళాలని అనిపించలేదు.

అమ్మ బాగా కోప్పడింది. తనతోపాటు బయలుదేరింది.

కానీ - వెళ్ళామన్న సంతోషం లేకుండా చేసారందరూ!

మా యింట్లో వాళ్ళ కూతురికి సుఖం లేకుండా పోయిందని అత్తయ్య వాపోయిందట. నేనెంత సుఖంగా వున్నానో ఆవిడకేం తెలుసు?

నిరుపమ మేము మంచి బహుమతులు తేలేదని మొహం ముడుచుకుంది. చిన్నసైజు యుద్ధం చేసింది. అమ్మ చివరికి తన చేతికున్న గాజులు తీసి నిరుపమ చేతిలో పెట్టింది - మౌనంగా! నేనూ మౌన ప్రేక్షకుడినే!

అన్నిటికీ మించి పాప నాకొక పజిల్‌లా వుంది. పాప చూడడానికి నెలలు నిండిన బేబీలానే వుంది. కానీ ప్రిమెచ్యూర్ బేబీ. పాప నిరుపమ దోషిత్వానికి చిహ్నం కాదు కదా? నా ఆలోచనలు ఆపై సాగలేదు. నేనే సాగనివ్వలేదు. ఇప్పటికే ఓ భావంలో చిక్కుకొని బయటకు రాలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నాను. మళ్ళీ అదే భావన పాపకూ అన్వయించనా?

పాపను నా బిడ్డలాగే నా చేతుల్లోకి తీసుకొన్నాను. హృదయానికి హత్తుకొన్నాను.

కానీ, నా గుండెల నిండా వెలితి. ఆ శూన్యాన్ని పాప నింపగలదా? మౌనాన్ని తుంచగలదా? ఏమో? తనలో మరింత న్యూనతను పెంచు తుందేమో! క్షణక్షణం అప్శాక్‌ను జ్ఞప్తికి తెస్తూ!

**నిరుపమ**

పాపను చూడడానికి తల్లీకొడుకులిద్దరూ చేతులాడించుకొంటూ వచ్చారు. ఓ రవ్వ ఉంగరమో పిందెల గొలుసో తెస్తే ఏవయ్యేది? ఏమీ తెలీదు. మా వాళ్ళందరి ముందు నా తలకొట్టేసినట్లయింది. అత్తయ్య ఏడుపు మొహం పెట్టుకొని చేతిగాజులు తీసిచ్చింది. పెద్దావిడకు ఆ బుద్దేదో ముందే వుండొద్దూ? వార్త విన్నాక ఉన్న పళాన బయలుదేరి వచ్చారుట! సంబడం బద్దలయినట్లే వుంది!

కానీ, నేను నిజంగా సంతోషించే మాటొకటి చెప్పారు. మాలతికి కూడా ఆడపిల్లేనట. మాలతికి మగపిల్లాడు పుట్టనందుకు నేనెంతో సంతోషించాను.

నిజం చెప్పాలంటే భాను వచ్చిన రోజు విందు మాపాప పుట్టినందుకు కాక మాలతికి కొడుకు పుట్టనందుకు ఇచ్చాను!

అత్తయ్య భాను వూరికి వెళ్ళిపోయారు.

నేనూ తొందరగానే అత్తగారింటికి వచ్చేసాను. ఈ మగవాళ్ళని ఎక్కువకాలం ఒంటరిగా వదిలెయ్యకూడదు! ఎంతకయినా తెగిస్తారు!

మాలతి పుట్టింటి నుంచి వచ్చాక - ఓ రోజు మా పాపని చూడడానికి వచ్చింది. ఒక్క ఈడు వాళ్ళయినా మాలతి కూతురు మా పాప - రాణి కన్నా బొద్దుగా ముద్దుగా వుంది. నాకెలాగో అనిపించింది.

మాలతి మాత్రం చాలా సన్నబడింది. దవడలు పీక్కుపోయి, పళ్ళు ముందుకొచ్చాయి. ఒక్కటీ పాపతో చేసుకోలేక పోతోందిట. పెద్దవాళ్ళు ఎవ్వరైనా వుంటే ఎంతో సహాయంగా వుండేదని వాపోయింది.

ఆ మాటలు కావాలనే నన్ను దెప్పిపొడవాలనే మాలతి అన్నదనిపించింది. లేకపోతే అత్తయ్యే అలా అనమందేమో? ఎందుకంటే ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ పాప పని ఆవిడే చేస్తుందిగా! అదే ఆవిడ నిక్కు! ఏదో గొప్ప ఘనకార్యం చేస్తున్నట్లు ఆవిడ్ని అనుక్షణం పొగుడుతూ నెత్తి నెక్కించుకోవాలేమో! ఇంక నావల్ల కావట్లేదు.

ఇప్పుడు భాను సంపాదన కూడా పెరిగింది. మాటిమాటికి మామయ్యను దేబిరించాల్సిన అవసరం ఇప్పుడు లేదు. అందుకే బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను. ఓ శుభోదయాన భీష్మించుకు కూర్చున్నాను - నేనూ భానూ వేరే ఇంట్లోకి మారేదాకా అన్నం ముట్టనని!

కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లు అత్తయ్యే భానుకి నచ్చజెప్పి ఒప్పించింది. వారం రోజుల్లో భాను క్లినిక్ దగ్గరలో ఇల్లు చూసుకోవడం, మారడం అన్నీ జరిగి పోయాయి. కావలసిన సామానదీ మామయ్యే తీసిచ్చాడు. అత్తయ్య ఏవో పాతసామాను అంటగట్టబోయింది. అక్కర్లేదని అక్కడే పడేసాను.

మార్కెట్‌లో వున్న ఆధునాతన వస్తువులన్నీ కొనకపోయినా చాలామట్టుకు కొనిచ్చాను. సంప్రదాయం ప్రకారం వీటికి డబ్బు అమ్మవాళ్ళు ఇవ్వాలట! అత్తయ్య గొణుగుతోంది. వాళ్ళెందుకు ఇవ్వాలి? ఒక్కడే కొడుకు గదా! వున్న సొమ్ము కొడుక్కు ఖర్చు పెట్టకపోతే ఆ ముసలాళ్ళు పోయేటప్పుడు మూటకట్టుకుపోతారా?

అన్నీ అమిరాయి కానీ మంచి పనిమనిషి - వంట మనిషి కుదరలేదు.

నాకు వంటరాదు. అత్తయ్యని అడగాలంటే నామోషీ వేసింది. అందుకనే పనిపిల్లచేత మూడుపూటలూ హోటల్‌నుంచి తెప్పిస్తున్నాను.

భాను మధ్యాహ్నం భోజనానికి కూడా ఇంటికి రాడు. ఓ రోజు మామయ్య భానుతో కలిసి భోంచేసాడుట. ఆ రోజు సాయంత్రం నుండే అత్తయ్య క్యారియర్ పంపడం మొదలెట్టింది. క్రమం తప్పకుండా!

ఓ సమస్య తీరిపోయింది. హోటల్ భోజనం ఎంతకాలం తింటాం? అందులోనూ అత్తయ్య వంటకు అలవాటు పడ్డప్రాణాలు - ఇప్పుడు కుదుట పడ్డాయి.

నా దృష్టంతా భాను మీదా పాపమీదా కేంద్రీకరించాను. భాను క్లినిక్ ఇప్పుడు హాస్పిటల్ అయ్యింది. సిబ్బంది పెరిగింది. ఆదాయమూ పెరిగింది.

వాచ్‌మన్ కూతుర్ని పాప పనికి పెట్టాను. పాప సమస్య తీరింది.

భానుకి మెల్లిమెల్లగా నా యిష్టాయిష్టాల పరిధిలోకి లాక్కొచ్చాను. భాను ఇంట్లో వున్నంత సేవూ అతని పన్లన్నీ నేనే చేస్తాను. కాళ్ళకు బూట్లు వేయడం దగ్గర్నించి తలంటుస్నానం వరకూ. అలాగే భాను వాడే బ్లేడుముక్క దగ్గర్నుంచి కట్టుకొనే బట్టల వరకూ అన్నీ నా ఇష్టప్రకారమే ఇంట్లోకి వస్తున్నాయి. ఒక విధంగా భాను నేను లేకపోతే జీవించలేనంత భ్రమలో పడిపోయాడు. ఆ మార్పు భానులో స్పష్టంగా కనిపిస్తోంది. బయటికి వెళ్ళేపుడు చెప్పి వెళుతున్నాడు. అయినా నేను అహర్నిశలు భానుని కనిపెడుతూనే వున్నాను. మగాళ్ళని నమ్మినట్లే నటిస్తూ నమ్మకుండా - అదుపులో వుంచాలన్న సూత్రం నేను అమ్మ నుంచి నేర్చుకున్నాను.

భాను ఇప్పుడు నామాట లేందే నా సలహా లేందే కాలు తీసి బయటకు పెట్టడు. నా పలుకే వేదవాక్కు!

కానీ, నేను ఆశించినంత మార్పు - అమ్మ ఆశించినంత అణుకువ భానులో ఇంకా రాలేదు. ఇప్పటికీ నా కన్ను కప్పి - అత్తయ్య వాళ్ళింటికో శరత్ వాళ్ళింటికో వెళుతూనే వున్నాడు.

ఇక ఆలోచించాల్సింది వాళ్ళ విషయమే!

**భానుమూర్తి**

ఓ రోజు పొద్దున్నే ఏం బుద్ధి పుట్టిందో కానీ నిరుపమ తిండి తినకుండా పాపకి పాలివ్వకుండా బిగదీసుకు కూర్చుంది.

గుక్కపెడుతోన్న పాపను సముదాయించలేక అమ్మ నిరుపమని పిలుచుకురమ్మని ప్రాధేయపడింది.

నిరుపమ కోరిక విన్న నేను నిర్ఘాంత పోయాను. అమ్మానాన్నలను వదిలి వేరుగా వుండడమా? ఒక్కగానొక్క కొడుకును! వాళ్ళకి తను తనకి వాళ్ళు తప్ప ఇంకెవరున్నారు? ఈ వయస్సులో వాళ్ళ ముందీ ప్రస్తావన తెచ్చి వాళ్ళని క్షోభ పెట్టడమా? అసలు నిరుపమ ఆగడానికి అంతెక్కడ?

నేను నోరు విప్పి మాట్లాడే లోగానే - పాపను దగ్గరకు తీసుకువెళ్ళిన అమ్మతో నిరుపమే మొహాన గుద్దినట్లు చెప్పింది. అమ్మ నన్ను వప్పించే సరికి మధ్యాహ్నమయింది. నాన్న మౌనంగా చూస్తూ వుండిపోయాడు. ఆయనకు మాట్లాడడానికి ఏమీ తోచినట్లుగా లేదు. నేను మొండికేసాను. ససేమిరా ఒప్పుకోలేదు.

పసిబిడ్డ గొంతు ఎండిపోతుందేమోనని అమ్మ మాత్రం తల్లడిల్లిపోయింది. బాలెంతరాలి వుపవాసం ఆవిడ భరించలేక పోతోంది.

నిరుపమ తన పంతం నెరవేర్చుకున్నాకే పాపను వళ్ళోకి తీసుకుంది.

కొత్త యింట్లోకి సామాన్లన్నీ నిరుపమ నాన్ననే తెమ్మని పురమాయించింది. ఇంట్లో అదనంగా వున్న సామాను కొంత తీసుకోమంటే చాలా దురుసుగా తిరస్కరించింది. ఈ పెద్దవయసులో అమ్మా నాన్న నలిగిపోతున్నారు. కోరి కొరివితో తలగోక్కోవడం అంటే ఇదేనేమో!

చేయాల్సిన గొడవంతా చేసి వేరు కాపురం పెట్టిందే కానీ నిరుపమ గృహిణి బాధ్యతలు మాత్రం నెత్తిన వేసుకోలేదు. ఇంటి పనికో మనిషి, వంటకో మనిషి, పాపకోమనిషి కావాలంది. చివరికి నాకు హోటల్ మెతుకులే ప్రాప్తమయ్యాయి. నిజానికి నేనిప్పుడు ఒక వంటమనిషిని కానీ హోటల్ ఖర్చులు కానీ భరించగలిగే స్థితిలో లేను. కానీ ఏం చెయ్యాలి? తప్పదు! అమ్మను కాదనుకొని వచ్చాక పిడికెడు అన్నం కోసం మళ్ళీ వెళ్ళాలంటే మొహం చెల్లడం లేదు.

ఓ రోజు మధ్యాహ్నం క్లినిక్‌లో భోంచేస్తున్నపుడు నాన్న వచ్చాడు. ఆరోజు క్యారియర్‌లో ఎండినట్లుగా వున్న రెండు వడలు, తోళ్ళలా సాగుతోన్న పూరీలు రెండు వున్నాయి. నాన్నకి ఆ క్షణంలో - నిరుపమని పెళ్ళి చేసుకోంటే అందబోయే సౌఖ్యాల గురించి వర్ణిస్తూ నాతో ఒకప్పుడు చేసిన వాదన గుర్తొచ్చే వుంటుంది. పాపం ఆయనకి మాత్రం మాట్లాడడానికి ఇప్పుడేం మిగిలింది?

తల్లి కడుపు చూస్తే భార్య జేబు చూస్తుందంటారు. ఇతరుల విషయంలో ఏమో కానీ తన విషయంలో మటుకు అది నూటికి నూరుపాళ్ళూ నిజం!

అమ్మ ప్రతి పూటా శ్రద్ధగా వండి పంపుతోంది. మేం తోసేసుకొని వచ్చినా ఆవిడ బంధాన్ని వదులుకోగలదా? కడుపుతీపి! నిరుపమా ఓ తల్లేగా? మరి ఆమెలో తల్లితనం ఎందుకు లేదు? అందరితో ఏదో కక్ష సాధిస్తున్నట్లు ఎందుకు ప్రవర్తిస్తుంది? ఎప్పుడు ఏ విషయానికి పట్టుపడుతుందో ఏ విషయానికి కోపం తెచ్చుకుంటుందో అర్థం కాదు.

ఇంత రాద్ధాంతాలు చేస్తూ నాకు మాత్రం నా యిష్టాయిష్టాల ప్రమేయం లేకుండా సకలసపర్యలు చేస్తుంది. బయటి నుంచి రాగానే బూట్లు విప్పడం దగ్గర్నించి తలంటిస్నానం పోసేవరకూ!

నవ్వాలో ఏడవాలో తెలియని పరిస్థితి! వద్దంటే ఏం వుపద్రవం సృష్టిస్తుందోనన్న భయం చేత అన్నీ వచ్చినట్లు భరిస్తున్నాడు. ఎవరి ముందైనా అయితే నిరుపమ మరింత విపరీతంగా ప్రవర్తిస్తుంది. హొయలు పోతూ ప్రేమ వొలకబోస్తూ! ఇంత చేసినా అమ్మానాన్నల ఊసే సహించదు. ఆమె మాట చండశాసనం!

ఓ రోజు హఠాత్తుగా గదిని ఏ.సి. చేయించమని కూర్చుంది. ఏ.సి. చేయించడమంటే మాటలా? అందులోనూ అద్దెకొంపకి అనవసరం కదూ?

నిరుపమ తన తరహా మొండితనం చేసి చివరికి సాధించింది. నేను మాత్రం అప్పుతో బయట పడ్డాను.

నేనెలాగు నా నిర్లిప్తత నుండి అసంతృప్తి నుండి బయటపడలేను. నిరుపమనైనా తను కోరినట్లు ఉండనియ్యాలనుకొన్నాను.

నాదృష్టిలో ఇప్పుడు వుంది ఒక్కటే - నిరుపమ కోరినట్లు వుండడానికి పుష్కలంగా అవసరమైన ఇంధనం - డబ్బు!

ఆ డబ్బుకోసమే నాన్న ఇలాంటి నిర్ణయం తీసుకొన్నాడు. మొదటి నుంచీ మా కన్నా వారికి ఆ డబ్బే ఎక్కువగా వుందన్న అహమే నిరుపమను అలా ఆవహించి అహంభావిని చేసింది. నిరుపమ మీద అదుపు సంపాదించాలంటే ఆమె అహంభావాన్ని పోషించే డబ్బు సంపాదించాలి. విపరీతంగా సంపాదించాలి.

నేను ఇప్పుడు నిజంగానే బాగా సంపాదిస్తున్నాను. విపరీతంగా సంపాదిస్తున్నాను. ఒక డాక్టరుకు డబ్బు సంపాదించడానికి ఎన్ని మార్గాలున్నాయో అన్ని మార్గాల ద్వారా సంపాదిస్తున్నాను. ఎవరిమీదో కక్ష కట్టికట్టినట్లు దీక్షబూని మరీ సంపాదిస్తున్నాను.

ఒక రోజు శరత్ ఫోన్ చేసాడు. చాలా రోజుల తరువాత.

నా దగ్గర చూపించుకున్న పేషెంట్ ఎవరో అతని దగ్గరకు వెళ్ళారట. దగ్గు తగ్గడం లేదని ఫిర్యాదు చేస్తే నేను టి.బి, మందులు వ్రాసానట. ఎలాంటి పరీక్షలు చేయించకుండా ఆ పసిపిల్లవాడికి అలాంటి మందులు అనవసరంగా ఎందుకు వ్రాసావని కోప్పడ్డాడు. శరత్ పరీక్షిస్తే వాడికి అసలా జబ్బు ఛాయలే లేవుట. ఇలాంటిదే మరోకేసుకు అనవసరంగా హార్మోన్లు - స్టెరాయిడ్లు ఇచ్చానని కోప్పడ్డాడు.

నాకూ కోపం వచ్చింది. ఆయనెవరు నాకు చెప్పడానికి? నాట్రీట్‌మెంట్ నచ్చకపోతే ఇంతమంది నాచుట్టూ ఎందుకు తిరుగుతారు? ఆ మాటే శరత్‌ని నిలదీసాను.

వాళ్ళ అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకోవద్దనీ - ఇలాంటి వక్రమార్గాలు అనుసరించ వద్దనీ - నామెడికల్‌షాపు లోంచి నకిలీ మందులు తీసేయించమనీ - ఇంకా ఇలాగే ఏదేదో హితబోధ చేయబోయాడు. నేను చెవిలో దూర్చుకోలేదు.

ఎందుకంటే శరత్ నన్ను చూసి అసూయ పడుతున్నట్లున్నాడు. మాలతి తనని చూసి ఈర్ష్య పడిందని నిరుపమ అన్నట్లుగా గుర్తు. ఎందుకంటే నేనీ మధ్య కారు కొన్నాను. స్థలం కొన్నాను. త్వరలో సొంత హాస్పిటల్ కట్టించబోతున్నాను.

ప్రథమ శత్రువు ప్రాణస్నేహితుడే అవుతాడంటారు.

శరత్‌తో సాన్నిహిత్యం తగ్గింది. నేనే తగ్గించాను. ఇద్దరి మధ్యా అగాధాలు పెరిగాయి. పోటీ మొదలైంది. నాచుట్టూ కొంతమంది చేరారు. శరత్ చుట్టూ కొంతమంది. వీళ్ళు భట్రాజులకు ఏ మాత్రం తీసిపోరు. అక్కడి వార్తలు ఇక్కడికి ఇక్కడి వార్తలు అక్కడికి చేరవేస్తుంటారు. మావి రెండు వర్గాలుగా తయారయ్యాయి. మౌనయుద్ధం చెలరేగుతూనే వుంది.

నిరుపమ సంవత్సరానికో రెండుమూడు రోజులు పుట్టింటికి వెళుతుంది. నేను నా బృందంతో మా యింట్లో సమావేశమవుతాను. ఆ సమావేశంలో లోగడ శరత్ వాళ్ళందరితో కలిసినపుడు చిప్పిల్లే ఉల్లాసం కానీ, శాస్త్రాన్ని గూర్చిన తర్కవితర్కాలు కానీ, యుక్తీ చలోక్తులు కానీ వుండవు.

విద్యార్థి దశలో నాకు పరిచయమైనవి కొన్ని ఇప్పుడు అలవాట్లుగా మారాయి. అవి నిరుపమ వున్నా వుండకపోయినా నిరాఘాటంగా కొనసాగుతూనే వున్నాయి.

నిరుపమ వూరెళుతున్నా, బయటకు వెళుతున్నా గ్లాసులతో సహా దాచి,తాళాలేసుకొని వెళుతుంది. ఆమెకు నాపై వున్న అనుమానానికి నాకు విరక్తి కలిగింది.

ఎలాంటి దురలవాట్లు, వ్యసనాలు లేకుండా మంచి అబ్బాయిలా వున్నపుడు నన్ను అనుమానించింది. నిందించింది.

ఇప్పుడు నా దృక్పథం వ్గారింది. చేసినా చేయక పోయినా అనుమానిస్తున్నపుడు నాకు తోచినట్లు చేసుకుపోవడమే ఉత్తమమని!

అలాగే నిరుపమ ముందు ఆమెకు నచ్చినట్టు వుండడం అలవాటు చేసుకొన్నాను. ఏది నిజమో ఏది అబద్ధమో కొన్ని కొన్ని సార్లు అనుమానం వస్తుంది. నిరుపమ కోరికలు చక్కగా తీరుతున్నాయి. చీరల రెపరెపలు, నగల ధగధగలు ఆమెని ఆక్రమించేసాయి.

త్వరలో ఓ వంట మనిషిని కుదుర్చుకొని, అమ్మకు శ్రమ తగ్గించాలి.

అమ్మను కలిసి, అమ్మతో మాట్లాడి ఎన్నాళ్ళయిందో!

అసలు అమ్మ ఎలా వుందో? ఈ కొడుకును గూర్చి ఏమనుకుంటుందో?

**నిరుపమ**

మాలతి ఏదో పని మీద బజారెళుతూ ఇంటికి వచ్చింది. మాటల మధ్యలో ఎయిర్‌కూలర్ కొన్నామని చెప్పింది. అబ్బో ఏం టెక్కు! పనిగట్టుకొని ఈ విషయం చెప్పడానికి వచ్చినట్లుంది. మహాతల్లి! మూడోనాటికి ఇంట్లో ఎ.సి. పెట్టించి మాలతికి ఆ విషయం తెలియజేసాను. భాను మొదట కాస్త నసిగాడనుకోండి! అది వేరే విషయం!

అసలు ఈ మధ్య భానులో ఏదో మార్పు వచ్చింది. నేనామధ్య ఊరెళ్ళినపుడు స్నేహితులందరిని ఇంట్లోపోగేసి నాన రభస చేసాడంట. రాగానే పక్కింటావిడిచ్చిన సమాచారం. ఏం జల్సాచేసారో కానీ తను వచ్చేసరికి ఆనవాళ్ళుకూడా లేకుండా చేసారు. నేనసలు మొదటినుంచే చాలా జాగ్రత్తగా వుండేదానిని. ఎప్పుడు బయటకు వెళ్ళాలన్నా గ్లాసులతో సహా దాచేసేదానిని.

మళ్ళీ నాకే అనిపిస్తుంది మరీ అంత నియమాల్లో వుంచకూడదేమోనని! కానీ ఈ మగాళ్ళని నమ్మనే నమ్మకూడదు. ఏ క్షణంలో ఏ బుద్ధి పుడుతుందో!

మా హాస్పిటల్‌లో కొత్తగా ఓ డాక్టరు చేరింది. ఆవిడ వచ్చిన దగ్గర్నించి భాను వాలకం మారింది. తన దుస్తుల మీదా - తయారీ మీదా శ్రద్ధ

పెరిగింది. భాను ఆసుపత్రి నుంచి వస్తాడో లేదో ఫోన్ చేస్తుంది. ఆవిడగారి ఫోన్ రావడం ఆలస్యం - ఈయనగారు ఉరుకులు పరుగుల మీద హాజరవుతారు. కేసులనీ అవనీ ఇదనీ కుంటిసాకులు చెపుతారు. నేనంత అమాయకురాలినేం కాదు. ఏం చెప్పినా నమ్మడానికి! మగవాడి గాంభీర్యమంతా పైటగాలి రెపరెపలాడే వరకే!

నేను అప్పుడప్పుడు హఠాత్తుగా వెళ్ళి, వాళ్ళిద్దర్నీ తనిఖీ చేసి వస్తుంటాను. స్టాఫ్ అందర్నీ హెచ్చరించి వచ్చాను. ఆ అమ్మాయి - ధాత్రి చాలా నాజుగ్గా చురుగ్గా వుంటుంది. ఆ మాలతి లాగానే ఎప్పుడు పళ్ళికిలిస్తూ అందర్నీ కలేసుకు తిరుగుతుంది. నన్ను చూడగానే మొహం చాటంత చేసుకొని పలకరిస్తుంది. ఆవిడ్ని కనుక అదుపులో వుంచక పోతేనా? హమ్మో...!

అన్నట్లు, అదేం విడ్డూరపు మనిషో కానీ - చక్కగా తిని కూర్చోక మాలతి ఓ స్కూల్ తెరుస్తోందట. ఆ మాలతి ఎందుకలా సుఖంగా వున్న ప్రాణాన్ని కష్ట పెట్టుకుంటుందో! అదో పిచ్చి!

అయినా ఎవరెట్లా పోతే నాకేం కానీ, భాను ఎట్లా పోకుండా కాపాడుకోగలిగాను. అదే పదివేలు!

ఓ రోజు బజారెళ్ళి వస్తూ వస్తూ ఆసుపత్రి లోకి తొంగి చూసాను. భానుగదిలో భాను ధాత్రి వంటరిగా కూర్చుని వున్నారు. ఏం తప్పు చేయనిదే నేను తలుపు తీయగానే ఆ ఇద్దరూ అంతలా నిర్ఘాంతపోతారు! గుమ్మడి కాయల దొంగలెవరంటే భుజాలు తడుముకున్నట్లుంది వాళ్ళ వ్యవహారం!

నేనూరుకుంటానా? ఆ నంగనాచిని చెడామడా కడిగేసాను. పర్సులోంచి డబ్బులు తీసి మొహాన కొట్టి - బయటకు నడవమన్నాను. ఈవిడగారిలాంటిది కాబట్టే ఆమె భర్త వంటరిగా వదిలేసి దేశాల్ని పట్టి పోయినట్లున్నాడు!

భానుతో ఖచ్చితంగా చెప్పేసాను. ఇకపై జూనియర్ డ్యాక్టర్ కావాలంటే మగాళ్ళని పెట్టుకోమని! చెప్పేవి శ్రీరంగనీతులు చేసేవి ఇలాంటి పనులు!

ఆ కోపంలోనే గట్టిగా హెచ్చరించాను. భాను మీద - భాను సంపాదన మీద - భాను జీవితం మీద అధికారం వుంది నాకొక్క దానికే! ఇంకోరి నీడపడినా నేను సహించబోను. నిలువునా దహించి పారేస్తాను!

ఒక్క క్షణం కోపం చల్లారగానే అంతమంది పేషెంట్ల ముందు అలా ప్రవర్తించకుండా వుండాల్సిందనిపించింది. కానీ అదీ ఒకందుకు మంచిదే! ఎందుకంటే అది ధాత్రికే గుణపాఠం కాదు ఆసుపత్రిలో వున్న ఆడసిబ్బంది

అందరికీ హెచ్చరిక! పేరు పెట్టి ఒక్కొక్కరికీ చెప్పకపోయినా వాళ్ళామాత్రం గ్రహించలేరూ?

వాళ్ళ సంగతేమో కానీ భాను చాలా జాగ్రత్తగా వుంటున్నాడు. భాను పూర్తిగా నా కనుసన్నల్లోకి వచ్చినట్లే!

కానీ ఎందుకో భానులో పెళ్ళికి పూర్వం తొణికిసలాడే చురుకుదనం మచ్చుకైనా కనిపించడం లేదు. మన్ను తిన్న పాములా వుంటాడు. ఒక్కోసారి చాలా అసంతృప్తి కలుగుతుంది. నేనాడించినట్లు ఆడే వాడే కావాలనుకున్నాను కానీ కోరలు పీకిన పాముతో సహచర్యం కన్నా పౌరుషంతో బుసలు కొట్టే మిన్నాగుతో కలిసి వుండడంలో ఏదో తృప్తి తప్పకుండా వుంటుంది!

అలాంటప్పుడే నాకు అష్వాక్ జ్ఞాపకం వస్తాడు. భాను ఈ విషయం ఊహించనైనా ఊహించలేడు. అతనిలో ఆ స్పార్క్ లేదు. నేనే లేకుండా చేసానేమో!

భాను నామీద పూర్తిగా ఆధారపడుతున్నాడు కదా! బహుశా ఓ నిజం తెలిసిన రోజున భాను గుండె ఆగిపోతుందేమో!

ఎందుకంటే ఈనాటి సేవలకి మురిసిపోతున్నాడు కానీ - భానుకి ప్రేమతో సమకూరుస్తున్నవన్నీ - ఇంటిమేట్ స్ప్రే దగ్గర్నించి అన్నీ - అన్నీ అష్వాక్‌కు ఇష్టమైనవేనన్న విషయం నా పెదవిని దాటిన క్షణం! ఆ క్షణంలో భాను పరిస్థితి ఎలా వుంటుందో!

**భానుమూర్తి**

ధాత్రి నన్ను కలవడానికి వచ్చింది. ధాత్రి మా జూనియర్. నా క్లాస్‌మేట్ సుందరం భార్య. ఈ మధ్యనే వారి పెళ్ళయింది. సుందరం మెడిసిన్ అవ్వగానే అమెరికా వెళ్ళిపోయాడు. ధాత్రి ఏవో ఫార్మాలిటీస్ ఆటంక పరచడం వలన పెళ్ళి అవ్వగానే అతనితో వెళ్ళలేకపోయింది. ఇంకా కొంతకాలం ఇక్కడే వుంటుందట.

మాటల మధ్యలో ఖాళీసమయంలో మా హాస్పిటల్‌కి వస్తూండమని ఆహ్వానించాను. తను ఏవో పరీక్షలకు సిద్ధమవుతోందట. నైట్‌డ్యూటీ చేస్తానంది.

నాకు అది ఎంతో సౌకర్యంగా వుంటుంది. ఇప్పుడు పేషెంట్లు పెరిగాక పగలంతా పని ఎక్కువగా వుంటుంది. రాత్రిళ్ళు కేసులు అటెండ్ అవ్వాలంటే విసుగ్గా వుంటుంది. అందులో సగం అర్థం పర్థం లేని ఆదుర్దా సమస్యలే!

ధాత్రికి ఓ గది ఏర్పాటు చేసాను. పుస్తకాలు తెచ్చుకొని చదువుకుంటుంది. కొన్ని సార్లు పగలు కూడా వుండిపోతుంది.

ధాత్రి వచ్చాక చాలా ఉత్సాహం వచ్చింది. ధాత్రి ద్వారా సుందరం కబుర్లు - మాపాత మిత్రుల సంగతులు - సుందరం ఉత్తరాల్లో వివరించే వైద్య పరిజ్ఞానం - రాజకీయాలు - ఇలా ఎన్నో విషయాలు సంభాషించడానికి దొరుకుతున్నాయి.

కేసుల గురించి డిస్కస్ చేస్తున్నపుడు నాకర్థమయింది - టీమ్‌వర్క్‌లో వుండే సౌలభ్యమూ ఆనందమూ. శరత్ రాకపోకలు తగ్గిపోయాక నాపరిధి మరీ కుంచించుకు పోయింది. ధాత్రి శరత్ లేని లోటును పూరిస్తోంది.

ఈ మధ్య మాలతి వచ్చి తనో స్కూలు తెరుస్తున్నానని ఆహ్వానించింది.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. శరత్ దాదాపు నాతో సమానంగా సంపాదిస్తున్నాడు. మాలతి మరో పని చేయాల్సిన అవసరం లేనేలేదు. పాపతో కాలక్షేపం కూడా బాగానే అవుతుండాలి. మరి ఎందుకీ తాపత్రయం? ఈ మాలతి ఈ ధాత్రి పగలనక రాత్రనక ఎందుకు కష్టపడాలనుకొంటున్నారు? వారికి కావలసినన్నీ వున్నాయిగా? సకలసౌఖ్యాలను అనుభవిస్తూ, సుఖంగా నిరుపమ వున్నట్లుగా వుండొచ్చుగా? ఆ మాటే మాలతిని అడిగాను.

మాలతి సౌమ్యంగా నవ్వుతూనే గట్టి సమాధానం ఇచ్చింది.

"గుర్తింపు కోసం! వ్యక్తులుగా గుర్తింపబడడం కోసం! ప్రత్యేక వ్యక్తులుగా గుర్తింప బడడం కోసం! ప్రముఖ వ్యక్తులుగా ఎదగడం కోసం! అన్నిటికీ మించి మేము మేముగా నిలబడడం కోసం!"

నిజమే, నిరుపమకి ఈ తత్వం ఎలా అర్థమవుతుంది? కనీసం ఇలాంటి ఆలోచనలున్న వారున్నారని కూడా గుర్తించదే! నిజానికి నిరుపను రోజూ ఇంట్లో ఏం చేస్తుంది? నాకే సమాధానం తట్టలేదు.

తింటుంది. పడుకుంటుంది. కాదు...కాదు... ఇంకొన్ని చేస్తుంది.

అజమాయిషీ చేస్తుంది. ఆర్భాటం చేస్తుంది. రాద్ధాంతం చేస్తుంది.

ఆ రాద్ధాంతం ఎంత వికృతంగా చేయగలదో ఎంత అర్థరహితంగా చేయగలదో తొందర్లోనే తెలిసింది.

నిరుపమ ఓ చదువుకున్న మూర్ఖురాలు. అంతే!

అది ప్రతిక్షణం నిరూపించుకుంటూనే వుంటుంది!

ఓ రోజు నేనూ ధాత్రి ఏదో కేస్ విషయం చర్చిస్తున్నాం. నిరుపమ ధడాల్న తలుపు తీసుకొని లోపలకి వచ్చింది. కోపంతో బుసలు కొడుతున్న నిరుపమ మొహం చూడగానే నేనూ ధాత్రి నిర్ఘాంతపోయాం.

నిరుపమ వాలకం గమనించగానే ఏదో రాద్ధాంతం చేయబోతోందని నాకనిపించింది. ధాత్రిని వార్డులోకి వెళ్ళమని చెప్పబోయాను.

ఆ లోగానే నిరుపమ ధాత్రి మీద విరుచుకు పడింది. నిరుపమ ఎంత సంస్కారహితంగా మాట్లాడగలదో, ప్రవర్తించగలదో అంత సంస్కారరహితంగా మాట్లాడింది ప్రవర్తించింది. చివరికి పర్సులోంచి డబ్బులేసి ధాత్రి మొహాన విసిరికొట్టింది. ఇద్దరు డాక్టర్లు ఆ ధాటికి ఆగలేక దోషులే అయ్యారు!

నాకు అక్కడిక్కడ సిగ్గుతో చచ్చిపోవాలనిపించింది. సాటి డాక్టరుకు అంత అవమానం అగౌరవం జరిగినా బెల్లంకొట్టిన రాయిలా నిల్చుండిపోయిన నా చేతకానితనానికి నన్ను నేను అసహ్యించుకోవడం కన్నా ఏం చేయగలను?

నా ఇరవై మంది సిబ్బంది ముందు, నావైద్యం కోసం ఎదురు చూస్తున్న అనేక మంది పేషెంట్లు ముందు నేనొక దద్దమ్మను అయ్యాను. ఈ రోజు నుండి నేను ఏ మొహం పెట్టుకొని వారిపై అధికారం చలాయించగలను? నిరుపమామేడం గారే వారికి అన్నీ అయ్యారు!

మేడం గారు నామీద గట్టి నిఘా ఏర్పాటు చేసారు!!

అవును మరి! నిరుపమనే అనుమానించిన అనుమాన పిశాచిని!

అనుమానం రుచిని, దాని పరిణామం రుచిని నేను కూడా తెలుసుకోవద్దూ?

నేను ఈ సంఘటన నుంచి పూర్తిగా తేరుకోకముందే మరో సంఘటన.

శరత్ ఫోన్ చేసాడు. అమ్మకి అనారోగ్యంగా వుందట!

కన్నతల్లి అనారోగ్యం పరాయివాళ్ళ ద్వారా తెలవడం కన్నా ఘోరం మరోటి వుంటుందా?

శరత్‌ని పరాయివాళ్ళలో జమకట్టేసానా? ఎప్పుడైతే నేను శరత్‌తో మనసు విప్పి మాట్లాడడం మానేసానో అప్పుడే ఆ పరాయి భావన వచ్చేసింది.

ఆ భావన రాకూడనే రాకూడదు. ఒకసారి వచ్చాక అంతసులువుగా వదిలిపోదు.

మాలతి అమ్మని పిలవడానికని వెళ్ళిందట. అమ్మ బక్కచిక్కిన అవతారం చూసి, బలవంతంగా శరత్ దగ్గరకి లాక్కెళ్ళిందట.

శరత్‌తో అమ్మ తన గురించి ఏమని చెప్పుంటుందో! కొడుకు వున్నాలేనట్టేనని వాపోయివుంటుందా? శరత్‌నే కొడుకులా సమయానికి ఆదుకున్నావని కృతజ్ఞతలు చెప్పుకొని వుంటుందా?

నా ఆలోచనలు తెగకముందే శరత్ వచ్చాడు. నేను ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే మౌనంగా నా చేతిలో అమ్మ రిపోర్టులు వుంచాడు.

అమ్మకి క్యాన్సర్!

నా మెదడు మొద్దుబారి పోయింది.

శరత్ ధైర్యం చెప్పి, మరిన్ని పరీక్షల కోసం - అవసరమైతే చికిత్స కోసం మద్రాసు వెళ్ళాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాడు.

నాన్నను పిలిచి, ఆయనతో కూడా శరత్ పరిస్థితిని వివరించి చెప్పాడు.

అమ్మను మద్రాసు తీసుకెళ్ళాం. అక్కడా అదే తేలింది. రెండవదశ. అమ్మకు విషయం తెలియనీయకుండా జాగ్రత్తపడుతూ ఊరికి తిరిగి వచ్చాం. నేరుగా వారిని పాతయింటికే తీసుకెళ్ళాను. మా ఇంటికి రమ్మని పిలిచే ధైర్యం నాకు లేదు. అమ్మను ఇంటికి తీసుకొచ్చి ఏం చెయ్యాలి? ఎవరు చూడాలి? ఈ బ్రహ్మాండమైన భవంతిలో ఆమెని పట్టించుకొనేదెవరు? అక్కడైతే కనీసం నాన్నైనా చొరవ తీసుకుంటాడు.

ఇక్కడ నిరుపమ కనీసం అమ్మను పరామర్శిస్తుందన్న ఆశ నాకు లేదు. నిరుపమ అమ్మతో ఏదో ప్రతీకారం తీర్చుకుంటున్నట్లుగా ప్రవర్తిస్తుంది. ఈ దశలో కూడా అమ్మకు మానసికక్షోభ కలిగించనా?

కానీ.. కానీ.... అంతటి రోగాన్ని తనలోనే దాచుకొని ఈనాటి వరకూ నాకూ...నా భార్యకూ.. నాబిడ్డకూ.. కడుపునిండా అన్నం పెడుతోంది! ఇందుకు ప్రతిఫలంగా నేనేం చెయ్యగలను?

నేను ఆడపిల్లనైనా బావుండేదేమో! అమ్మకి ఇలాంటి సమయంలో సాయం అయ్యుండే వాడిని! కనీసం...వాటేసుకొని భోరుమని ఏడ్చేవాడిని!

నేను ఏమీ చేయలేను - చివరికి ఆర్థిక సహాయం కూడా!

నా ఆదాయమంతా నిరుపమ ఆధీనంలోనే వుంటుంది. జమాఖర్చులు ఆమే చూసుకుంటుంది. కానీ - ఏ ఆలోచనలో వుందో ఏమో నిరుపమ తనే స్వయంగా అమ్మకు డబ్బు సహాయం చేయమంది.

నాన్న సంవత్సరం పాటు మద్రాసులో వుండి అమ్మకు చికిత్స చేయించాడు.

కాలచక్రం నిశ్శబ్దంగా కదిలిపోతూనే వుంది. అమ్మ ఆరోగ్యం ఓ కొలిక్కి రాకముందే నాన్న కాలంలో కలిసిపోయాడు.

అమ్మ ఇప్పుడు ఒంటరిది.

నిరుపమను అమ్మ దగ్గరకు వెళ్ళమని కానీ, అమ్మ ఇంటికి తీసుకొద్దామని కానీ నేను అనలేను. ఆ ధైర్యం నాకు లేదు. నిరుపమ యిష్టాయిష్టాలతో నేను రాజీపడిపోయాను. ఘర్షణ పడకూడదన్న నా తత్వానికి నేను బానిసనై పోయాను.

నిరుపమ అమ్మ బాగోగులకు ఓ పనిమనిషిని కుదిర్చింది. అప్పుడప్పుడు డాక్టరు దగ్గరకి అమ్మని తీసుకొచ్చినపుడే ఆ పనిమనిషి అమ్మను నా దగ్గరకి తీసుకొస్తుంది.

అమ్మ కూడా నన్ను రమ్మని కానీ, నేనే ఆమెకి సపర్యలు చేయాలని కానీ ఏనాడు అడగలేదు.

కానీ, ఏమీ కోరని ఆ మౌనం నన్ను - నా హృదయాన్ని మెత్తని కత్తిలా చీల్చేస్తుంది.

నేను అశక్తుడిని. నేను కొడుకుగా విఫలమయ్యాను. నేను తండ్రిగా కూడా విఫలమవుతానేమో!

ఎందుకంటే నా యింట్లో నా చిట్టితల్లి పసితనపు అమాయకత్వాన్ని అహంభావం ఆక్రమిస్తోంది.

మిగిలిన ఐస్‌క్రీం తింటానని అడిగిన నేరానికి వాచ్‌మెన్ నాలుగేళ్ళకూతుర్ని టెర్రస్ మీద మండుటెండలో ఒంటికాలి మీద రోజంతా నిలబెట్టింది. ఆ అమ్మాయి పట్లే కాదు ఆసుపత్రి సిబ్బంది పట్లా పాప ప్రవర్తన అంత నిర్దాక్షిణ్యంగానే వుంటుంది. నిరుపమను వెరిచి అందరూ పాప ఆగడాలను చచ్చినట్లు భరిస్తున్నారు. ఆడించినట్లు ఆడుతున్నారు. నెత్తిన ఎక్కించుకుంటున్నారు.

అందువలన నిరుపమ అహం ఖచ్చితంగా తృప్తిపడుతుంది. కానీ, మరో మేడం గారు రూపుదిద్దుకుంటోంది! మరో నిరుపమ తయారు చేయబడుతోంది! గతాన్ని నేను మార్చలేను. ప్రస్తుతాన్ని మార్చలేను. భవిష్యత్తును మార్చలేనా?

అత్తయ్యకి అంతులేని రోగం వచ్చింది. ఎప్పటికైనా ఆమె నా ఆధీనంలోకి రావాలని నేనూ కోరుకున్నాను. కానీ ఇలా కాదు.

అందులోనూ ఆమె ఆరోగ్యం బాగాలేకపోతే తిన్నగా కన్నకొడుకు దగ్గరకో నాదగ్గరకో రాక ఆ శరత్ దగ్గరకి వెళ్ళిందట! ఎంత అవమానం!

వయసు మళ్ళినా, మంచాన పడ్డా ఈవిడగారికి పొగరు మాత్రం తగ్గలేదు. ఈనాటికీ నాయింటి గడప తొక్కలేదు. ఛీ! ఏం మనుషులో! పరాయి వాళ్ళను కలేసుకొని తిరుగుతారు. అయిన వాళ్ళను దూరం చేసుకొంటారు.

ఆవిడకే అంత అభిమానం వుంటే తనకెంత వుండాలి?

వాళ్ళని మాతో వుంచుకోవాలని భానుకి వుంటుందేమో! ఆ అనారోగ్యం మనుషులిద్దర్నీ పెట్టుకొని ఈ పనిమనుషుల్తో వేగడం ఎలా? అందులోనూ రాణిని వారికి దగ్గరగా వుంచడమూ మంచిది కాదు. ఈ ముసలాళ్ళు నా చిట్టిరాణికి అవీ ఇవీ నేర్పించి పాడు చేస్తారు!

అత్తయ్యకు మరీ బావుండ్లేదని వంటమనిషిని పెట్టించాడు భాను. ఆ వంటమనిషి చేసే తిండేం తింటాం? పై నుంచి ఎప్పుడు మానేస్తుందో నన్న భయం ఒకటి! అందుకే భానుతో చెప్పాను. అత్తయ్యకు అవసరమైన మందులన్నీ వాడండి. చికిత్సలన్నీ చేయించండి. ఓ మనిషిని పెట్టండి, ఏమైనా చేయండి, త్వరగా తగ్గేలా చూడండి అని.

కానీ ఆశ్చర్యంగా ఎవ్వరం వూహించని విధంగా మామయ్య ఆవిడ కన్నా ముందే.. పోయాడు. ఎందుకనో ఈ మధ్య ఆయన బాగా చిక్కిపోయాడు. దేని గురించైనా దిగులు పడుతూ వుండేవాడేమో! పెళ్ళయిన కొత్తల్లో నేనాయనను పట్టించిన ఆటలు, పెట్టించిన తిప్పలు నాకు జ్ఞాపకం వచ్చాయి. పాపం ఆయన మంచాయన!

ఎటొచ్చి ఆవిడ గారే! ఇప్పుడు రోజూ మాలతి బడికి వెళుతుందిట! అక్కడ అత్తయ్య ఒరగబెట్టే పనులేం వుంటాయి? బడిపిల్లల బ్యాగులు మోస్తుందా? క్యారియర్లు మోస్తుందా? ఒక గొప్ప డాక్టరుకు తల్లినన్న సంగతి ఆవిడకు గుర్తులేదా? ఎలా ప్రవర్తించాలో ఇంగితం వుండక్కర్లా? మా పరువు నిలువునా తీసేస్తుంది! అయినా ఆ మాలతి కెట్లా బుద్ధి లేదు? తనంటే ఓ డాక్టరు భార్య అన్న గౌరవం నిలుపుకోకుండా ప్రవర్తిస్తోంది. ఓ డాక్టరు తల్లిని పన్లోకి తీసుకుంటుందా? ఎంతయినా మొదట్నించీ అహం ఎక్కువ.

ఫలాన డాక్టరు గారి తల్లి నాదగ్గర ఊడిగం చేస్తున్నదని ఘనంగా చెప్పుకుంటుందేమో!

మా గౌరవానికి నేను భంగం రానిస్తానా? నేను ఆ మాలతిని నాలుగూ కడిగేద్దామని వాళ్ళ స్కూలుకి వెళ్ళాను. నిజం చెప్పొద్దూ...అక్కడి వాతావరణం చూసాక ఒక్క క్షణం రాణిని తప్పక అక్కడే చదివించాలనిపించింది. అయినా అంతలోనే వాస్తవం లోకి వచ్చి పడ్డాను. మా బంగారు రాణికి అంత ఖర్మేం పట్టింది? రాణిని ఏ ఊటీలోనో డెహ్రాడూన్‌లోనో చదివిస్తాను.

మాలతి తో ఖచ్చితంగా చెప్పేసాను - మళ్ళీ ఎన్నడూ ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలెయ్యొద్దని! అత్తయ్య కనుక మరోసారి వాళ్ళ స్కూలు ఛాయలకు వచ్చినట్లు తెలిసిందంటే ఇద్దర్నీ వూరుకొనేది లేదని హెచ్చరించాను. మాలతి, అత్తయ్య మాట్లాడకుండా నిలువు గుడ్లేసుకుని నిల్చుండిపోయారు. అంతకాక మరేం చెయ్యగలరు?

ఇప్పుడు అత్తయ్య మీద గట్టి నిఘా వుంచాను. ఇంతకు ముందు నా దగ్గర పని చేసిన బుచ్చమ్మని ఆమె దగ్గర వుంచాను. అత్తయ్య నిద్రలేచిన దగ్గర నుంచి పడుకొనేదాకా. ఏవేం చేస్తుందో, ఎవరెవరినీ కలుస్తుందో అన్నీ నాకు బుచ్చమ్మ ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది. ఆ మాలతిని మళ్ళీ అత్తయ్యను కలవనీయలేదు.

అనుకోకుండా ఓ రోజు మాలతి వచ్చింది. ఎప్పటిలానే పళ్ళికిలించుకొంటూ వాళ్ళ స్కూల్ వార్షికోత్సవమని పిలిచి వెళ్ళింది. అంతా నటన! మా రాణిని వాళ్ళ బడిలో చేర్పించాలని మాలతి పన్నిన పన్నాగం!

అయినా ఆవిడగారి గొప్పతనమేదో దానికి అందరూ ఎళ్లా భజన చేస్తారో చూడడానికి నేను వెళ్ళాలా? నేను వెళ్ళలేదు.

భాను వెళ్ళాడని తరువాత తెలిసింది. ధాత్రి కూడా అమెరికా వెళ్ళిపోయిందట. ఆవిడకిచ్చిన సెండాఫ్ పార్టీకీ భాను వెళ్ళాడట!

నాకు తెలీకుండానే ఈ పనులన్నీ చేయాలని చూసాడు భాను. కాస్త ఆలస్యంగానైనా తెలిసాయి. మళ్ళీ జన్మలో అలా చేయబోనని వాగ్దానం చేసాడు. అతను చేయలేదు, నేనే చేయించాను.

మాలతి స్కూల్ వార్షికోత్సం ఫోటో - ధాత్రి వీడ్కోలు సభ ఫోటో రెండూ ఒకే రోజు పేపర్‌లో వచ్చాయి. నేను ఆ ఫోటోలను ఎంతసేపు చూస్తూవుండిపోయానో నాకే తెలియదు. అవి నాలో ఇంతకు మునుపు నేను

ఎన్నడూ ఎరగని అలజడిని సృష్టించాయి. అవి నాలో లేనివేవో స్పష్టంగా చూపిస్తున్నట్లుగా అనిపించాయి.

ధాత్రి చాలా అందంగా, గంభీరంగా వుంది. పట్టణంలోని సీనియర్ డాక్టరు ఆమెకు మెమెంటో అందచేస్తున్నారు. ధాత్రి మొహంలో వినయ విధేయతలు తొణికిసలాడుతున్నా ఆమె కళ్ళు ధీమాగా తేజోమయంగా వున్నాయి. ధాత్రి ఏవో పరీక్షల్లో మొదటిస్థానం సాధించిందట!

ఇక మాలతి - ఎప్పటిలానే నోరంతా తెరిచి పళ్ళికిలిస్తూ వుంది. శరత్ కూడా పళ్ళికిలిస్తూ ఆమెనే చూస్తున్నాడు. ముఖ్య అతిథి కూడా పళ్ళికిలిస్తున్నాడు! వాళ్ళిద్దరంటే సరే ....కానీ ఈయన కెందుకంత సంబరమో!!

మొట్టమొదటిసారిగా నన్ను నేను నిజాయితీగా ప్రశ్నించుకొన్నాను.

ధాత్రిలోని విశ్వాసం కానీ మాలతీలోని సంతోషం కానీ తనకూ వున్నాయా? శరత్ మాలతిని చూసి సంతోషించినట్లు భాను తనను చూసి ఎప్పుడైనా సంతోషించాడా? అయినా తనేం ఘనకార్యంచేసిందని సంతోషిస్తాడు?

తన విజయాలుగా భావించినవన్నీ ఒక్కసారిగా అపజయాలుగా తోచాయి. ఆ ధాత్రి ముందు మాలతి ముందు నేనో మరుగుజ్జుననిపించింది.

కానీ అంతలోనే నా వాదన నన్ను కమ్మేసింది. నా ముసుగు నేను వేసేసుకున్నాను.

నేను భాను ఆస్తిని కాపాడుతున్నాను. భాను అంతస్తును కాపాడుతున్నాను నేను లేకపోతే భాను లేడు. అతని అస్తిత్వమూ లేదు. అందుకే నేను ఆ ధాత్రి కన్నా ఆ మాలతి కన్నా ఎక్కువే! తనూ భాను ఆ శరత్ మాలతిల కన్నా చాలా బాగానే వుంటున్నారు. కానీ వాళ్ళందరూ తమగురించి అలాగే అనుకుంటున్నారా? వాళ్ళకి తాము ఎంత సఖ్యంగా వున్నారో ఎలా తెలుస్తుంది?

నాకు వెంటనే ఓ ఆలోచన వచ్చింది. రాబోయే మా వివాహవార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నదే ఆ ఆలోచన. మేము మేడ్‌ఫర్ ఈచ్ అదర్ అనీ ఆదర్శప్రాయమైన దంపతులమనీ అందరికీ తెలియాలి. మాలతికి తెలియాలి. శరత్‌కి తెలియాలి. అప్పాక్‌కి తెలియాలి. తెలిసేలా చేయాలి.

ఆ నిర్ణయానికి రావడం ఆలస్యం - ముందుగా ఓ చక్కటి ప్రకటన తయారు చేయించాను. వాళ్ళ పేరుతో వీళ్ళ పేరుతో వివిధ పత్రికల్లో ప్రకటింపచేసాను. ఇద్దరం సన్నిహితంగా నిలబడి దిగిన ఫోటోను ప్రచురణకు ఇచ్చాను.

ఆ ప్రకటన సారాంశం ఇదీ-

పూవూ తావి కలయికగా - రాగం తానం పల్లవిగా
శబ్దార్థంబుల కలయికగా - నిండు పున్నమి వెన్నెలలా విలసిల్లే
అన్యోన్యమైన - ఆదర్శప్రాయమైన మీ దాంపత్యం
సెలయేటిపై పూలనావలా కలకాలం సాగాలి -

**భానుమూర్తి**

పుదయం ఆసుపత్రికి వెళ్ళానో లేదో ఒక గుంపు - లోనికి దురుసుగా దూసుకొని వచ్చారు. ఇద్దరు వ్యక్తులు మాత్రం పిల్లవాడిని లోపలికి తీసుకొని వచ్చారు. ఒకతను చాలా ఆవేశంగా వున్నాడు. అతనే నాలుగురోజుల క్రితం ఈ పిల్లవాడిని నా దగ్గరకి తీసుకొచ్చాడు. మరొక అతను శాంతంగా వివరించాడు.

పిల్లవాడికి - నేను, లోగడ రాసిచ్చిన మందులు వేయగానే వళ్ళంతా బుసబుస పొంగినట్లు వాచిందట. నా దగ్గరికి తీసుకువస్తే మరో ఇంజెక్షన్ వేసి, మరిన్ని మందులు వ్రాసి యిచ్చి, భరోసా యిచ్చి పంపానట. తెల్లవారే పాటికి పిల్లవాడికి దృష్టి మందగించిందట.

వాళ్ళు చెప్పడం మొదలు పెట్టగానే నాకు విషయమంతా గుర్తొచ్చింది. వాళ్ళ చివరిమాటలు వినగానే నా నోరు తడారిపోయింది. మొదట్లో శరత్ చేసిన హెచ్చరిక జ్ఞాపకం వచ్చింది. వాళ్ళు మందులు కొన్నది నా ఆసుపత్రి మెడికల్ కౌంటర్‌లోనే! వాటిలోని నకిలీమందులు, అవి సృష్టించగలిగే ప్రమాదాలు నాకు తెలియనవి కావు.

వాళ్ళు కోపంతో చిందులు తొక్కుతున్నారు. ఫోరంలో కేసువేస్తామని - ఆసుపత్రిని ముందు ధర్నా చేస్తామని - ఆసుపత్రిని ధ్వంసం చేస్తామనీ... ఇంకా ఏవేవో అన్నారు. నా కాళ్ళు చల్లబడిపోయాయి. మెల్లిగా ధైర్యం కూడదీసుకొని - వ్యవహారం చక్కదిద్ది - వారికి పాతికవేలిచ్చి పంపాను.

వాళ్ళు వెళ్ళాక కూడా నాకు శాంతిగా అనిపించలేదు. ఎందుకంటే ఇలాంటి విషయాల్లో అన్నివేళలా డబ్బు అడ్డుపడదు. ఎప్పుడో ఓ సారి ... ఎవరో ఒకరి చేత నాకు దండన తప్పదు!

ఎవరో నా మెడకి ఏదో బరువు వేసి అగాథంలోకి తోసినట్లనిపించింది. బహుశా అది నా పిరికితనం కావచ్చు - నా వ్యాపారగుణం కావచ్చు -నా అవకాశవాదం కావచ్చు!

ఈ క్షణంలో నన్ను ఒడ్డున పడేసి స్వాంతన చేకూర్చగలిగేది ఒక్క ప్రియస్నేహితుడి సాన్నిహిత్యం మాత్రమే. అదీ శరత్‌లాంటి స్నేహితుడు మాత్రమే.

కానీ, శరత్‌ని నేనే స్వయంగా దూరం చేసుకొన్నాను. జీవితాంతం పంచుకోగలిగే స్నేహాన్ని నా జీవితసహచరిణితో పెంచుకోలేకపోయాను.

నేను ఒక వైద్యుడిగా విఫలమయ్యాను. ఒక స్నేహితుడిగా విఫలమయ్యాను. ఒక వ్యక్తిగా విఫలమయ్యాను. నేను .... నేనుగా విఫలమయ్యాను.

నాకు ఆరోజు మాలతి స్కూల్ వార్షికోత్సవమని జ్ఞాపకం వచ్చింది. మరో ఆలోచనకు తావివ్వకుండా - వెంటనే బయలుదేరి వారి దగ్గరకు వెళ్ళాను.

శరత్ - మాలతి సాదరంగా ఆహ్వానించారు. ఆప్యాయంగా పలకరించారు. నేను మొదట్లో వారి మొహాల్లో గమనించిన ప్రశాంతత ఇప్పటికీ అలాగే వుంది. ఇప్పటికీ ఇద్దరి కళ్ళల్లో తృప్తి తొణికిసలాడుతోంది.

మాలతి తన భావన,. సాధన ఓ చక్కటి రూపు దిద్దుకొని, అందరి మన్ననలను అందుకోవడంతో సంతోషంతో సంబరపడుతోంది. భార్య సంతోషానికి శరత్ సంబరపడుతున్నాడు.

నిజమే దాంపత్యంలో అన్యోన్యత ఒకరినొకరు పరస్పరం గుర్తించడంలోనూ, గౌరవించడంలోనూ వుంది.

అది తనలాంటి రాజీ మనుషులను సాధ్యం కాదు. సమన్వయం సాధించే క్రమంలో ఘర్షణపడాలి. నిర్లిప్తత రావాలి. సహనం కావాలి. సామరస్యం కావాలి.

తన లాంటి అబద్ధపు జీవితం అందమైనవే కానీ అబద్ధమైనది. సత్యమే సంతోషం. నిజము నిజాయితి లేని జీవితం నికృష్టమైనది. అలాంటి దాంపత్యం నిస్సారమైనది.

అలాంటి నికృష్ట జీవితానికి, నిస్సార దాంపత్యానికి నటనతో అందమైన ముసుగు వేసి ఇతరులను మభ్యపెట్టవచ్చునేమో కానీ - మనస్సాక్షి ముందు ఏదో ఓనాడు దోషులుగా నిలబడాల్సివస్తుంది.

ధాత్రి వెళ్ళిపోయింది. ఎందరివో అభినందనలు అందుకొని వెళ్ళిపోయింది. ధాత్రి ఆనాటి వీడ్కోలు విందులో నన్ను చొరవగా పలకరించినా నేను అపరిచితుడిలాగా నిలబడ్డాను. నా అపరాధభావమే నన్ను అపరిచితుడిని చేసింది.

అలవాటుపడిన నా అసత్యజీవితానికి నేను తెరదించలేను. రాజీ పడి మరింత నటన నేర్చాను. మనసులోని భావాల్ని బయటకు రానీయకుండా బూటకపు మాటలతో జాగ్రత్తగా కప్పివుంచుతున్నాను. లోకం నన్ను భార్యావిధేయుడన్నా నేను ఏమీ అనుకోను.

దాని పర్యవసానంగా మృత్యువుకు చేరువలో వున్న నా తల్లి ఒంటరిదైపోయింది. ఖరీదైన పనిమనిషి ఆంక్షల మధ్య ఊపిరి పీల్చుకోవడానికి కూడా కొట్టుమిట్టాడుతోంది. మాలతి బడిలో పసిమనసుల మధ్య ఊరట పొంది - కాస్త ఉల్లాసంగా గడిపిన అమ్మ ఇప్పుడు ఆ చిన్ని ఆనందానికి కూడా దూరంగా నెట్టేయబడింది. నా తల్లి నన్ను ఏనాటికీ క్షమించదు. ఎప్పుడైనా చేతగాని కొడుకును కని పెంచిన పాపానికి పశ్చాత్తాపంతో ఓ కన్నీటి బొట్టు రాలుస్తుందేమో!

నా అంతరంగాన్ని విప్పి చూడడానికి నాకే ధైర్యం లేదు. ఇప్పుడు నేను సంతోషంగా వుండడం కన్నా సంతోషంగా వున్నట్లు కనిపించడం ముఖ్యమని భావిస్తాను. అలా కనిపించడానికి ఏం చేయడానికైనా సిద్ధమే.

లోగడ నిరుపమ ఎలా ప్రవర్తించిందో కానీ పెళ్ళయ్యాక మాత్రం నా చుట్టూ అల్లుకుపోయింది. ఆమె పట్ల నిజాయితీ లేని నటన నాదని నాకు స్పష్టంగా తెలుసు. అందుకే ఆమె అభీష్టం నెరవేరడానికి సహకరించడం నా ధర్మమనిపించింది.

నిరుపమ మా పెళ్ళిరోజున ప్రకటన ఇద్దామని అన్నపుడు వెంటనే ఒప్పుకున్నాను. హృదయంతో పనిలేని ఇలాంటి హంగామా ఆమె తృప్తి కోసం చేయడంలో తప్పేం వుంది?

★ ★ ★

నిరుపమ, భానుమూర్తి నాకింకా ఎన్నో విషయాలను చెప్పేవారే!

కానీ మా ఏకాంతాన్ని భంగం చేస్తూ మా గేటు శబ్దమైంది.

నేను ఒక్కసారిగా లోకంలోకి వచ్చిపడ్డాను.

బార్లా తీసిన గేటుముందు ఓ ఖరీదైన కారు ఆగివుంది. దాంట్లోంచి ఓ వ్యక్తి దిగి - మరోవైపు డోర్‌ను తెరిచి - వినయంగా - కాస్త వంగినట్లుగా నిలబడ్డాడు. ఓ యువతి కారులోంచి దిగింది.

వారిద్దరూ నన్ను కలవడానికే వచ్చారు. సందేహం లేదు.

ఇంకా కొన్ని క్షణాల్లో వారిరువురూ నా దగ్గరికి వచ్చేస్తారు. ఆ లోపలే నేను ఇంటిలోపలికి వెళ్ళిపోవాలి.

నేను గబగబ నా చేతిలోని పేపర్ మడిచేసాను. శబ్దం రాకుండా మునివేళ్ళపై నడుస్తూ ముందుగది తలుపు చేరవేసాను.

పనిమనిషి ఎక్కడికెళ్ళిందో ఏమో?

ఏమైనా వాళ్ళు లోపలికి వచ్చేలోగా మీకో విషయం చెప్పాలి.

ఇంత దాకా నాతో పాటు సావధానంగా మీరూ చూసిన - ఆ అంతరంగాల్ని అలాంటి అబద్దపు అద్దాల మధ్యే వుండనివ్వండి!

మీరు మాత్రం ఖచ్చితంగా అలాంటి అద్దాల ముసుగు ధరించరనే - అలాంటి దగా బతుకులు బతకబోరని నా మనసు గట్టిగా చెపుతోంది!

ఎక్కడి నుంచి వచ్చిందో ఏమో మా పనిమనిషి గొంతు వీధి గుమ్మంలో వినబడుతుంది.

నేను గబగబ గదిలోకి దూరి, మంచం ఎక్కి, దుప్పటి బిగించాను.

ఆ వచ్చినవాళ్ళు నన్ను సమీపిస్తున్నట్లు వారి అడుగుల చప్పుడు చెప్పకనే చెపుతోంది. ఆ వచ్చిన వాళ్ళెవరో ఇకనైనా మీకు చెప్పొద్దూ!

మీరు నేను చెప్పింది విన్నాక ఏ మాత్రం సానుభూతి చూపించినా నేను సహించబోనండోయ్! మరి చెప్పేయమంటారా?

ఆ వచ్చిన యువకుడు - భాను!

ఆ యువతి ఎవరో మీకు తెలిసిపోయే వుంటుందిగా! నిరుపమ!

ఇక నేను

ఊహలే ఊపిరిగా - ఆలోచనలే ఆసరాగా - కాలం వెళ్ళబుచ్చుతోన్న భానుమూర్తి కన్నతల్లిని!

(వనిత, అక్టోబర్ & నవంబర్, 1996)